

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## కుంకీ ఏనుగులు వస్తున్నాయ్!

*- 24న మన్యం జిల్లాకు రాక*

4



# థాంక్యూ సీఎం సార్

- విశాఖలో ఓపీఎస్ ఉద్యోగుల కృతజ్ఞతాభివందన సభ
- సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం
- పాల్గొన్న ప్రభుత్వ విప్ వేపాడ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు






*సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారిన ఉత్తరాంధ్ర ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో కృతజ్ఞతాభివందన సభ ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఉద్యోగులు తమ కుటుంబసభ్యులతో కలిసి సుమారు 15 వేల మంది సభకు హాజరయ్యారు. 'థాంక్యూ సీఎం సార్' అంటూ ఉద్యోగులు చేసిన నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది.*

3



## ఒలింపిక్స్‌లోనూ జోరు కొనసాగించాలి

**జపాన్ ఓపెన్ టైటిల్ విజయం గర్వకారణం**

**పీవీ సింధును అభినందించిన సీఎం చంద్రబాబు**

*అమరావతి(చైతన్యరథం): జపాన్ ఓపెన్ టైటిల్ గెలిచిన తెలుగు షట్లర్ పీవీ సింధును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. భారత బ్యాడ్మింటన్ చరిత్రలో ఇది మరో చారిత్రాత్మక మైలురాయి అని ఆయన అభివర్ణించారు. ఈ ఆటలో పీవీ సింధు అద్భుత ప్రదర్శన కనబరిచిందని హర్షం వ్యక్తం చేశారు. ఒలింపిక్స్‌లోనూ ఇదే జోరు పీవీ సింధు కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. 'ఆల్ ది బెస్ట్ ఫర్ ఒలింపిక్స్ అమ్మా' అంటూ సింధుకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్‌కు మరోసారి పీవీ సింధు గర్వకారణంగా నిలిచారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా వేదికగా అభినందనలు తెలిపారు. యమగుచిపై 21-17, 21-17తో వరుస గేమ్‌లలో పీవీ సింధు విజయం సాధించి చరిత్ర సృష్టించింది.*

# హంద్రీనీవాపై గొడ్డలి పార్టీ డ్రామాలు

- 2014-19 మధ్య చంద్రబాబు ప్రత్యేక చొరవతో కాలువ విస్తరణ పనులు వేగంగా సాగాయి
- 2019 నాటికే దాదాపు 35 శాతం పనులు పూర్తి
- తర్వాత జగన్‌రెడ్డి ప్రాజెక్టును నిలిపివేసి దెబ్బతీశారు
- కాలువను విస్తరిస్తామని నమ్మబలికి మోసగించాడు
- కూటమి వచ్చాక రెండేళ్లలోనే కాలువ విస్తరణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు మేలు చేశాం
- గత ఏడాది రికార్డు స్థాయిలో 60 టీఎంసీలకు పైగా నీటిని తీసుకురావడం ప్రభుత్వం సాధించిన విజయం
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ



4

## రిజిస్ట్రేషన్ సేవల ప్రైవేటీకరణ అవాస్తవం

***వైసీపీ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: కూటమి ప్రభుత్వం***

4

రాష్ట్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని రిజిస్ట్రేషన్ సేవలు ప్రైవేటీకరణ అంటూ వైసీపీ చేస్తున్న ఆరోపణలు అసత్యమని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ దుష్ప్రచారాన్ని ఆదివారం ఖండించింది. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు ద్వారా సేవలు మరింత సులభతరం చేస్తున్నట్లు వివరించింది.

## తమ్మినేని భూ కబ్జా బాగోతం

- నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ దందా
- యజమాని బతికుండగానే మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి నిర్వాకం


4

## కరోనా కేసులపై అప్రమత్తం.. ఆక్సిజన్ ట్యాంకర్ల సిద్ధం

*అమరావతి (చైతన్యరథం): కరోనా కేసుల అలజడి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల్లో ప్రత్యేక కొవిడ్ వార్డులు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే కొన్ని ఆసుపత్రుల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఆక్సిజన్ ట్యాంకులు సిద్ధం చేస్తున్నారు. విజయవాడ జీజీహెచ్‌లో 20 కిలోలీటర్లు, 13 కిలోలీటర్ల సామర్థ్యంతో మొత్తంగా 33 కిలోలీటర్ల ఆక్సిజన్ ట్యాంకులు అందుబాటులో ఉన్నాయి. ఈ ట్యాంకుల్లో ఆక్సిజన్ నిల్వ తగ్గక ముందే ఇలా ట్యాంకర్ తెప్పించి సిద్ధంగా ఉంచు తున్నారు. విజయవాడ జీజీహెచ్‌లో 33 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు కూడా ఉన్నాయి. అంతేకాకుండా కొవిడ్ కోసం మూడు ప్రత్యేక వార్డులతో విజయవాడ జీజీహెచ్‌ను సర్వ సన్నద్ధంగా ఉంచారు.*



చైతన్యరథం



# తెలుగు సినిమా ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


### - 72వ జాతీయ చలనచిత్ర విజేతలకు సీఎం చంద్రబాబు అభినందనలు

అమరావతి (చైతన్యరథం): 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల విజేతలం దరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. సినిమా కీర్తిని మరింత పెంచి తెలుగు చలనచిత్ర పరిశ్రమకు ఎనలేని గర్వకారణంగా నిలిచిన నటీనటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు, చిత్ర బృంద సభ్యులందరినీ ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు చెప్పారు. కళ, సంస్కృతి, సినిమా మన గుర్తింపునకు, వారసత్వానికి బలమైన స్తంభాలని వ్యాఖ్యా నించారు. తెలుగు సినిమా మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరో హిస్తూ రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. అవార్డు గ్రహీతలందరికీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు, మరెన్నో ప్రశంసలు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ బెస్ట్ విషెస్ తెలిపారు. 72వ జాతీయ చలన చిత్ర పురస్కార విజేతలను సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. నిహారిక కొణిదెల నిర్మించిన కమిటీ కుర్రోళ్లు ఉత్తమ చిత్రంగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. నేషనల్ ఫిలిమ్స్ 9 అవార్డులతో టాలీవుడ్ సత్తా చూపించడం గర్వంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

# క్యూఆర్ కోడ్‌తో పర్యాటక స్థలాల చరిత్ర

- **ఏపీ టూరిజం శాఖ ఏఐ సేవలు**
- **ఎక్స్‌ప్లర్జర్ ట్రావెల్ సంస్థతో ఒప్పందం**
- **మంగళగిరి నుంచి ప్రయోగాత్మకంగా ప్రారంభం**

అమరావతి(చైతన్యరథం): ఏపీ పర్యాటక శాఖ ఆలయాల చరిత్రను పర్యాటకులు సులభంగా తెలుసుకునేందుకు వీలుగా ఏఐ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు పర్యాటక ప్రాంతాలకు వెళ్లిన వారు సమాచార బోర్డులు, బ్రోచర్లు చదవడం, గైడ్ల ద్వారా అక్కడి ప్రత్యేకతలు తెలుసుకునే వారు. దీంతో భాష తెలియని వారు, విదేశీ పర్యాటకులు ఇబ్బంది పడుతుండేవారు. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'నీవు ఏఐ న్యూరల్ ఇంటెలిజెన్స్ వెర్నాక్యులర్ యూనిఫైడ్ మోడల్‌తో ఇలాంటి అనేక సమస్యలకు పరిష్కారం లభించనుంది. పర్యాటకుడి అనుభవాన్ని పూర్తిగా మార్చే దిశగా రాష్ట్ర పర్యాటక శాఖ, ప్రపంచవ్యాప్తంగా ట్రావెల్ టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్న ఎక్స్‌ప్లర్జర్ సంస్థతో ఇటీవల ఒప్పందం చేసుకుంది.





### 100కు పైగా పర్యాటక ప్రాంతాల్లో సేవలు

రాష్ట్రంలో 100కు పైగా పర్యాటక ప్రాంతాల్లో ఏర్పాటు చేసే క్యూఆర్ కోడ్‌ను మొబైల్‌లో స్కాన్ చేస్తే ప్రత్యేక యాప్ అవసరం లేకుండానే సేవలు ప్రారంభమవుతాయి. సందర్శకుడు ఏ భాషలో ప్రశ్న అడిగినా అదే భాషలో సమాధానం వస్తుంది. మొత్తం 113 భాషల్లో సమాచారం తెలుసుకోవచ్చు. ఆలయాలైతే వాటి స్థల పురాణం, దారిత్రక నేపథ్యం, దర్శన సమయాలు, సమీప దేవాల యాల వివరాలు చెబుతుంది. కోటలు, బీట్లు, ప్రకృతి ప్రాంతాలైతే వాటి చరిత్రతో పాటు సమీపంలోని ఇతర సందర్శనీయ ప్రాంతా లు, ఒకటి, రెండురోజుల పర్యటన ప్రణాళికలు కూడా సూచిస్తుంది. ఈ సేవలో ప్రత్యేకత ఏమిటంటే.. ప్రతిఒక్కరికీ ఒకే సమాచారం చెప్పదు. చిన్నారులకు సులభంగా, చరిత్రపై ఆసక్తి ఉన్న వారికి విస్తృతంగా, ఆధ్యాత్మిక యాత్రికులకు ప్రత్యేకంగా, విదేశీ పర్యాటకులకు వారి భాషలో సమాచారం అందిస్తుంది.

### ప్రయోజనాలు

గైడ్ కోసం వెతుక్కోవలసిన అవసరం ఉండదు. భాష తెలియక ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. మొబైల్లోనే పూర్తి సమాచారం లభిస్తుంది. సమీపంలోని పర్యాటక ప్రాంతాల వివరాలు తెలుస్తాయి. వ్యక్తిగత ఆసక్తికి అనుగుణంగా సూచనలు ఇస్తుంది. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) వెబ్‌సైట్‌ను కూడా ప్రభుత్వం ఆధునికీకరించింది. పర్యాటకులకు అవసరమైన సమగ్ర సమాచారం అందుబాటులో పెట్టారు. పర్యాటక ప్రాంతా లు, ప్యాకేజీల వివరాలు, వసతి కల్పన, ఇతరత్రా వివరాలు టూరిజం ఏపీ జీవోవీ ఇన్ వెబ్‌సైట్ ద్వారా పర్యాటకులు తెలుసుకోవచ్చు.



**మంగళగిరిలో ప్రయోగాత్మకంగా సేవలు**

*ప్రయోగాత్మంగా మంగళగిరిలోని ఎగువ, దిగువ లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నారు. దశల వారీగా రాష్ట్రంలోని మిగతా ఆలయాలకు విస్తరించనున్నా రు. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న సంస్థ 75 దేశాల్లో 2.2 కోట్లకు పైగా వినియోగదారులు ఉన్నారు. 130కు పైగా భాషల్లో సేవలు అందించే ఈ వేదిక గూగుల్ ఇంక్యుబేషన్ మద్దతుతో అభివృద్ధి చెందింది.*

# జాతీయ చలనచిత్ర విజేతలకు అభినందనలు: కొలుసు



అమరావతి (చైతన్య రథం): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ చలనచిత్ర అవార్డులకు ఎంపికైన విజేతలందరికీ సమాచార శాఖామంత్రి కొలుసు పార్థసారథి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. "ఉత్తమ చిత్రాలతో సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో సఫలీకృతమై, నేషనల్ అవార్డులు పొందిన వారికి దక్కిన గౌరవం ఇది.

తెలుగు చిత్ర పరిశ్రమలో అవార్డులు పొందిన వారికి ప్రత్యేక అభినందనలు. పుష్ప-2, కల్కి, లక్కీభాస్కర్, అమరన్, కమిటీ కుర్రోళ్లు తదితర చిత్రాలకు అవార్డులు దక్కడం ప్రేక్షక లోకానికి, చిత్ర బృందాలకు గర్వకారణం. తెలుగు చిత్ర పరిశ్రమ ఇదేవిధంగా భవిష్యత్తులో ఇదే పరంపర కొనసాగించి తెలుగువారి సత్తా చాటాలని, వచ్చే ఏడాది మరిన్ని ఎక్కువ అవార్డుల దిశగా దూసుకెళ్లాలని మనస్ఫూర్తిగా కాంక్షిస్తున్నాను" అని ప్రకటనలో పేర్కొన్నారు.

### పీవీ సింధుకి అభినందనలు

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్-750 ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్న సందర్భంగా ఆమెకు సమాచార, గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. "జపాన్ ఓపెన్ సూపర్-750 ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్న తొలి భారత క్రీడాకారిణిగా మన తెలుగమ్మాయి నిలవడం తెలుగుజాతికి ఎంతో గర్వకారణం. టోక్యోలో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్ మ్యాచ్‌లో ఆమె స్థానిక క్రీడాకారిణి, మాజీ ప్రపంచ ఛాంపియన్ అయిన అకానె యమగుచిని ఓడించి ఘనత సాధించింది. సింధు ఆట తీరును చూసి యావత్ దేశమంతా గర్విస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి ఎన్నో విజయాలను కైవసం చేసుకోవాలని, తెలుగుజాతి ఘనతను ప్రపంచానికి చాటిచెప్పాలని ఆకాంక్షిస్తున్నాను" అని ప్రకటనలో పేర్కొన్నారు.



# గ్లోబల్ 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా ఏపీ..

- జైపూర్ ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్క్లేవ్‌లో మంత్రి దుర్గేష్
- ప్రముఖ వెడ్డింగ్ ప్లానర్లతో మంత్రి దుర్గేష్ కీలక భేటీ
- ఏపీలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని పిలుపు
- ప్రభుత్వం తరపున పెద్దఎత్తున ప్రోత్సాహానికి భరోసా

జైపూర్ (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి 'వెడ్డింగ్ డెస్టినేషన్'గా ప్రమోట్ చేయడంపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక దృష్టి సారించారు. దేశంలోనే రాయల్ వెడ్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా, రోల్ మోడల్‌గా నిలిచిన రాజస్థాన్‌లోని జైపూర్‌లో మంత్రి దుర్గేష్ పర్యటించారు. ఈ సందర్భంగా జైపూర్ కుకాస్‌లోని విరాసత్ హెరిటేజ్ రెస్టారెంట్‌లో జరిగిన ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్క్లేవ్ (ఐడబ్ల్యూటీసీ)లో ప్రముఖ వెడ్డింగ్ డెస్టినేషన్ ప్లానర్లు, ఈవెంట్ నిర్వాహకులతో మంత్రి దుర్గేష్ కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్‌లో వెడ్డింగ్ టూరిజం విస్తరణకు ఉన్న అనుకూలతలు, సహజసిద్ధమైన వనరులు మరియు ప్రభుత్వ రాయితీలపై మంత్రి దుర్గేష్ సుదీర్ఘంగా చర్చించారు. కేంద్రం సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు పర్యాటక రంగానికి కల్పిస్తున్న ప్రాముఖ్యతను తెలిపారు. అంతకుముందు గుజరాత్ ఉప ముఖ్యమంత్రి, పర్యాటక మంత్రి దియా కుమారితో కలిసి ఆంధ్రప్రదేశ్ టూరిజం స్టాల్‌ను మంత్రి దుర్గేష్ ప్రారంభించి పలువురికి ఏపీ ప్రత్యేకతలను స్వయంగా తెలిపారు.




### వైజాగ్, అరకు, కోనసీమ, తిరుపతి.. అన్నీ వెడ్డింగ్ డెస్టినేషన్లే

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అద్భుతమైన ప్రకృతి అందాలు, చారిత్రాత్మక కోటలు, సుదీర్ఘమైన సముద్ర తీరాలతో వెడ్డింగ్ డెస్టినేషన్లకు అత్యంత అనువైన ప్రాంతంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి బీచ్ వెడ్డింగ్స్ నిర్వహించుకోవడానికి హిల్ రిసార్ట్స్ కలయికతో ఉన్న వైజాగ్ తీరం ఎంతో రమణీయంగా ఉంటుందని వివరించారు. సూర్యలంక బీచ్‌లో స్టార్ హోటళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పచ్చని ప్రకృతి, గిరిజన సంస్కృతి, ఎకో-టూరిజం వైభవం మరియు అంతర్జాతీయ గుర్తింపు పొందిన 'అరకు కాఫీ' విశిష్టతలతో అరకు పర్యాటకులను కట్టిపడేస్తుందని తెలిపారు. పచ్చని కొండలు, చల్లని వాతావరణం, పొగమంచు మధ్య ప్రశాంతంగా వేడుక జరుపుకోవాలనుకునే వారికి అరకు ఉత్తమమైన ప్రాంతం అని పేర్కొన్నారు. అదే గాక కోనసీమ ప్రాంతం పచ్చని కొబ్బరిచెట్లతో, మారేడుమిల్లి దట్టమైన అటవీ ప్రాంతంతో సుందరంగా ఉంటుందన్నారు. సాంప్రదాయ పద్ధతిలో, వైభవంగా వివాహం చేసుకోవాలనుకునే వారికి తిరుపతి మొదటి ప్రాధాన్యతగా మారుతోందని, ప్రస్తుతం అక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'వరల్డ్ క్లాస్ హోటల్స్' అందుబాటులోకి వస్తున్నాయని మంత్రి తెలిపారు. బాబా రామ్‌దేవ్ ఏపీలో వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు.

### సింగిల్ విండో విధానంలో అనుమతులు

మంత్రి దుర్గేష్ స్పీచ్‌తో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి వెడ్డింగ్ డెస్టినేషన్ ప్రాజెక్టులపై పెట్టుబడులు పెట్టేందుకు పలువురు వెడ్డింగ్ ప్లానర్లు సుముఖత వ్యక్తం చేశారు. ఏపీలో ఈవెంట్స్, టూరిజం ప్రాజెక్టులు చేపట్టే వారికి కూటమి ప్రభుత్వం తరపున సింగిల్ విండో విధానంలో అనుమతులు, అవసరమైన మౌలిక సదుపాయాలు మరియు పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, నూతన పర్యాటక పాలసీ 2024-29తో ఇన్వెస్టర్లకు రాయితీలు ఇస్తున్నామన్నారు. ఇవేగాక హోమ్ స్టే, క్యారవాన్, ల్యాండ్ అలాట్‌మెంట్, బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ తదితర అనుబంధ పాలసీలు అమలు చేస్తున్నామన్నారు. ఫిల్మ్ టూరిజంకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగ వృద్ధికి, ఉపాధి కల్పనకు వెడ్డింగ్ టూరిజం ఎంతో దోహదపడుతుందని, త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలన కోసం ఏపీలో పర్యటించాలని స్థానిక నిర్వాహకులను మంత్రి దుర్గేష్ అధికారికంగా ఆహ్వానించారు. ప్రకృతి ప్రసాదించిన అన్ని రకాల అందాలు ఏపీ సొంతమని, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తే ప్రభుత్వం తరపున అండగా ఉంటామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఈవెంట్ ప్రొఫెషనల్స్, హాస్పిటాలిటీ రంగానికి చెందిన ప్రముఖులు, ఇన్వెస్టర్లు, వెన్యూ ఓనర్స్, ట్రావెల్ అండ్ ట్రేడ్ పార్ట్‌నర్స్, టూరిజం స్టేక్‌హోల్డర్స్, వెడ్డింగ్ డెస్టినేషన్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల కుటుంబాలకు కూటమి ఆర్థిక భద్రత

- విశాఖలో ఓపీఎస్ ఉద్యోగుల కృతజ్ఞతాభివందన సభ
- సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం
- పాల్గొన్న ప్రభుత్వ విప్ వేపాడ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు







విశాఖపట్నం (చైతన్య రథం): మంచి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపే గొప్ప సంప్రదాయానికి ఉత్తరాంధ్ర ఉద్యోగులు తెరతీసి రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని శాసనమండలి ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు అన్నారు. సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు మారిన ఉత్తరాంధ్ర ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో కృతజ్ఞతాభివందన సభ ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పట్టభద్రుల ఎమ్మెల్సీలు ఆలపాటి రాజా, కంచర్ల శ్రీకాంత్, పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు. ఏపీ డీఎస్సీ ఫోరం, నోబుల్ టీచర్స్ అసోసియేషన్, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ తదితర ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఓపీఎస్ లబ్ధి పొందిన ఉద్యోగులు తొలుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సుమారు 15 వేల మంది సభకు హాజరయ్యారు. 'థాంక్యూ సీఎం సార్' అంటూ ఉద్యోగులు చేసిన నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది.

### ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భద్రత

శాసనమండలి ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ ఉద్యోగులకు పదవీ విరమణ ఉన్నా, వారి కుటుంబాలకు పదవీ విరమణ ఉండదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడం ద్వారా 11 వేల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భద్రత కల్పించిందని తెలిపారు. 2019-24 మధ్య రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా సాగిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులు డీఏలు, వైద్య బిల్లుల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.

ఉపాధ్యాయుల వేతనాలను రెవెన్యూ ఉద్యోగులతో సమానంగా పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదేనని పేర్కొన్నారు. 2004 నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొంది, సాంకేతిక కారణాలతో 2004 తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులకు ఓపీఎస్, ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ కల్పించిన ఘనత కూడా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని అన్నారు. రాష్ట్రం సింగపూర్ తరహాలో అభివృద్ధి చెందాలంటే స్థిరమైన పాలన అవసరమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు కూటమి ప్రభుత్వానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములని, రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

### ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల కోసం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఉద్యోగులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం కీలకమన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పరిపాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అపారమైన అనుభవం ఉందని, భవిష్యత్ తరాలకు మెరుగైన రాష్ట్రాన్ని అందించేందుకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద క్యూలైన్ల నియంత్రణకు వినియోగించి అవమానించారని అన్నారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ ఉద్యోగులకు మేలు చేసే ప్రతి కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులుగా తామంతా సమన్వయంతో పనిచేస్తూ ఉద్యోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీలు ఆలపాటి రాజా, కంచర్ల శ్రీకాంత్, పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు నాయకత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

### 'చంద్రబాబు మాకు పునర్జన్మ ఇచ్చారు'

పలువురు ఓపీఎస్ ఉద్యోగులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమకు పాత పెన్షన్ విధానం ద్వారా పునర్జన్మ ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. సభలో ఓ ఉద్యోగి ఆరేళ్ల కుమార్తె మాట్లాడుతూ, 'పెన్షన్ రావడంతో మా నాన్న చాలా సంతోషంగా ఉన్నారు. రోజూ పెన్షన్ ఇస్తే బాగుంటుంది' అని అమాయకంగా చెప్పడంతో సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది. ఈ సందర్భంగా ఉద్యోగులు అతిథులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఉద్యోగ సంఘాల నేతలు ఎం. శ్రీనివాసరావు, గోపినాథ్, ఆర్. అప్పలరాజు, కేఎల్ ప్రసాద్, బలగ శ్రీనివాస్, సుబ్బారెడ్డి, డాక్టర్ బి. గోవింద నాయుడు తదితరులు పాల్గొని ముఖ్యమంత్రి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# హంద్రీనీవాపై గొడ్డలి పార్టీ డ్రామాలు

- 2014-19 మధ్య చంద్రబాబు ప్రత్యేక చొరవతో కాలువ విస్తరణ పనులు వేగంగా సాగాయి
- 2019 నాటికే దాదాపు 35 శాతం పనులు పూర్తి
- తర్వాత జగన్‌రెడ్డి ప్రాజెక్టును నిలిపివేసి దెబ్బతీశారు
- కాలువను విస్తరిస్తామని నమ్మబలికి మోసగించాడు
- కూటమి వచ్చాక రెండేళ్లలోనే కాలువ విస్తరణ పనులు
- యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు మేలు చేశాం
- గత ఏడాది రికార్డు స్థాయిలో 60 టీఎంసీలకు పైగా
- నీటిని తీసుకురావడం ప్రభుత్వం సాధించిన విజయం
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ



ఉరవకొండ(చైతన్యరథం): ప్రజాభిమానం కోల్పోయిన వైసీపీ నాయకులు రాజకీయ ఉనికి కోసం తాపత్రయపడుతూ హంద్రీనీవా పనులపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. ఉరవకొండ పట్టణం సమీపంలో హంద్రీనీవా కాలువ పనులను ఆదివారం వారు పరిశీలించారు. అనంతరం వైసీపీ నేతల దుష్ప్రచారాన్ని ఎండగట్టారు. ఐదేళ్ల పాటు హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసి..ఇప్పుడు హంద్రీనీవా కాలువ పరిశీలన పేరుతో రాజకీయ డ్రామాలకు తెరలేపడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనని మండిపడ్డారు. 2014-19 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవతో హంద్రీనీవా కాలువ విస్తరణ పనులు వేగంగా సాగాయన్నారు.

2019 నాటికే దాదాపు 35 శాతం పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి ప్రభుత్వం వాటిని అర్ధాంతరంగా నిలిపివేసి ప్రాజెక్టు పురోగతిని పూర్తిగా దెబ్బతీసిందని ఆరోపించారు. జగన్‌రెడ్డి తన పాలనలో హంద్రీనీవాకు రూ.500 కోట్లు కూడా ఖర్చు చేయలేదని గుర్తు చేశారు. కాలువను 6,000 క్యూసెక్కులకు విస్తరిస్తామని, సమాం తరంగా మరో కాలువ నిర్మిస్తామని నమ్మబలికి అధికారంలో ఉన్నన్ని రోజులు విస్తరణ ఊసెత్తకుండా జిల్లా ప్రజానీకాన్ని నిలువునా మోసగించినప్పుడు నాడు జగన్‌రెడ్డిని వైసీపీ ప్రజా ప్రతినిధులు ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. విస్తరణ పనులను నిలిపివేసి తట్టెడు మట్టి కూడా ఎత్తని వైసీపీ నాయకు లకు హంద్రీనీవా గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని వ్యాఖ్యా నించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయగలిగామని తెలిపారు. అనంతపురం జిల్లా రైతులు, ప్రజలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకి ఉన్న చిత్తశుద్ధికి హంద్రీనీవా పనులే నిదర్శనమని పేర్కొన్నారు. గత ఏడాది రికార్డు స్థాయిలో 60 టీఎంసీలకు పైగా నీటిని తీసుకురావడం ప్రభుత్వం సాధించిన ఘన విజయమని స్పష్టం చేశారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో చంద్రబాబు చిత్తశుద్ధిని ఇటీవల నెల్లూరులో జరిగిన వైసీపీ రౌండ్‌టేబుల్ సమావేశంలో స్వయాన ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి ప్రస్తావించిన, ప్రస్తుతించిన విషయాన్ని గుర్తు చేశా రు. సొంత పార్టీ అంతర్గత సమావేశాల్లో వాస్తవాలు మాట్లాడు తూనే.. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు జిల్లా వైసీపీ నాయకు లు హంద్రీనీవా పరిశీలన పేరుతో సరికొత్త డ్రామాలకు తెర లేపా రని దుయ్యబట్టారు.



## కుంకీ ఏనుగులు వస్తున్నాయ్!

*- 24న మన్యం జిల్లాకు రాక*

*పార్వతీపురం(చైతన్యరథం): కుంకీ ఏనుగుల రాకకు ముహూర్తం ఖరారైంది. కర్ణాటక నుంచి రాష్ట్రానికి తీసుకొచ్చిన కుంకీల్లో రెండింటిని ఈనెల 24న జిల్లాకు పంపిస్తున్నట్లు అటవీశాఖాధికా రులు తెలిపారు. 22న అవి చిత్తూరులోని ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి మన్యంకు రానున్నట్లు వెల్లడించారు. కాగా వాటి రాకతో దశాబ్దాలుగా వేధిస్తున్న గజరాజుల సమస్యకు తెరపడ నుందని మన్యం వాసులు భావిస్తున్నారు.*

*ప్రస్తుతం పార్వతీపురం డివిజన్‌లో ఎనిమిది ఏనుగులు, పాలకొండ డివిజన్‌లో నాలుగు గజరాజులు సంచరిస్తున్నాయి. వాటి కారణంగా దశాబ్దాలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ఆస్తి, పంట, ప్రాణ నష్టాలను చవిచూస్తున్నారు. అయితే కుంకీల రాకతో జిల్లావాసుల కష్టాలు తొలగనున్నాయి. వాటి సాయంతో తొలుత పార్వతీపురం డివిజన్‌లో సంచరించే ఎనిమిది ఏనుగులను సీతా నగరం మండలం గుచ్చిమిలో ఏర్పాటు చేసిన ఎలిఫెంట్ జోన్‌కు తరలించే అవకాశం ఉంది. జిల్లావాసులను దీర్ఘకాలికంగా వేధిస్తున్న ఏనుగుల సమస్యను జిల్లా ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కుంకీల రాకకు చొరవ చూపారు. అంతేగాకుండా ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు భారీగా నిధులు మంజూరు చేశారు. కాగా ఈనెలలోనే మన్యంకు కుంకీలు వస్తుండడంతో జిల్లా వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.*

*ఈ వారంలో జిల్లాకు రెండు కుంకీ ఏనుగులు రానున్నాయి. 22న అవి ప్రత్యేక వాహనాల్లో చిత్తూరు జిల్లాలో బయలుదేరుతాయి. ఈనెల 23 లేదా 24వ తేదీకి జిల్లాకు కుంకీ ఏనుగులు వస్తాయని ఏనుగుల పర్యవేక్షణ విభాగం రేంజర్ మణికంఠేశ్ తెలిపారు.*

## రిజిస్ట్రేషన్ సేవల ప్రైవేటీకరణ అవాస్తవం

### వైసీపీ దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

### ఖండించిన కూటమి ప్రభుత్వం

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయా ల్లోని రిజిస్ట్రేషన్ సేవలు ప్రైవేటీకరణ అంటూ వైసీపీ చేస్తున్న ఆరోపణలు అసత్యమని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ దుష్ప్రచారాన్ని ఆదివారం ఖండించింది. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు ద్వారా సేవలు మరింత సులభతరం చేస్తున్నట్లు వివరించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ జరగడం లేదంటూ వివరించింది. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన చట్టబద్ధ అధికారాలన్నీ ప్రభుత్వ శాఖ వద్దే ఉంటాయని స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు, పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల తరహాలోనే పనిచేస్తాయని వెల్లడించింది. డాక్యుమెంట్ పరిశీలన, ఆమోదం, డిజిటల్ సంతకం, రిజిస్ట్రేషన్‌ను సబ్-రిజిస్ట్రార్లే నిర్వహిస్తారని పేర్కొంది. డేటా, రికార్డులు పూర్తిగా రిజిస్ట్రేషన్ శాఖ ఆధీనంలోనే ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల్లో ఫెసిలిటేషన్ ఛార్జీ గరిష్ఠంగా రూ.2 వేలు మాత్రమేనని వివరించింది. మధ్యవర్తులపై ఆధారపడే పరిస్థితి తగ్గి పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎనీవేర్ రిజిస్ట్రేషన్, అడ్వాన్స్ స్లాట్ బుకింగ్, ఇంటి గ్రేటెడ్ పేమెంట్ వంటి సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపింది. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన రిజిస్ట్రేషన్ సేవలు అందించడమే లక్ష్య మని ప్రభుత్వం వివరించింది.

## సీదిరి కుమారుడి యాక్సిడెంట్ కేసులో

### కాశీబుగ్గ సీఐ, ఎస్సై సస్పెన్షన్

శ్రీకాకుళం(చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఒకరిని ఢీకొట్టి మృతికి కారణమైన ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న అభియో గంతో కాశీబుగ్గ సీఐ ఎన్ని రామకృష్ణ, ఎస్సై సునీల్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు శనివారం విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. గత శుక్రవారం ఎస్సై సునీల్‌ను వీఆర్‌కు పంపిన విషయం తెలిసిందే. శనివారం మధ్యాహ్నం తొలుత సీఐ రామకృష్ణనూ వీఆర్‌కు పంపినట్లుగా ఉత్తర్వులు జారీచేశారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. దీనిపై అధికారికంగా ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

అభియోగాలు ఇవే

ప్రమాదం జరిగిన తర్వాత ఘటనా స్థలాన్ని సందర్శించకుండా కిందిస్థాయి సిబ్బందికి బాధ్యతలు అప్పగించి నిందితుడిని మార్చేందుకు సీదిరి అప్పలరాజుకు అవకాశమిచ్చారు. 10న రాత్రి ప్రమాదం జరిగితే 11వ తేదీ మధ్యాహ్నం వరకు సీసీటీవీ ఫుటేజి, ఇతర ఆధారాలు సేకరించకుండా ప్రమాద ఘటనలో లేని సిద్ధార్థను నిందితుడిగా మార్చేందుకు వెసులుబాటు ఇచ్చారు.

లొంగిపోయేందుకు వచ్చిన సిద్ధార్థనే నిందితుడిగా చూపించి కేసును 41 నోటీసుతో ముగించారు. కేసు నుంచి మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మను తప్పించడంలో సీఐ రామకృష్ణ, ఎస్సై సునీల్ పాత్ర ఉందన్న అభియోగాలు రావడంతో ప్రభుత్వం వారిని సస్పెండ్ చేసింది.

ఈ కేసులో ముగ్గురు కానిస్టేబుళ్లు, మరో అధికారిపైనా చర్యలు తీసుకునే అవకాశముందని పోలీసు వర్గాల సమాచారం. ఓ అధికారి స్టేషన్ సమాచారాన్ని మాజీ మంత్రికి చేరవేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రమాదం తర్వాత అప్పలరాజు, ఆయన అనుచరులతో మాట్లాడినట్లు కాల్ డేటా ఆధారంగా గుర్తించి విచా రించనున్నారు. పూర్తిస్థాయి విచారణ తర్వాత చర్యలు తీసుకునే అవకాశముంది.

## తమ్మినేని కుటుంబంపై భూ ఆక్రమణ కేసు

- నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ దందా
- యజమాని బతికుండగానే మరణ
- ధ్రువీకరణ పత్రాలు సృష్టించి నిర్వాకం

శ్రీకాకుళం(చైతన్యరథం): వైసీపీ నేత, ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంతో పాటు ఆయన సతీమణి వాణి, కుమారుడు చిరంజీవి నాగ్‌పై శ్రీకాకుళం రూరల్ పోలీసుస్టేషన్ లో కేసు నమోదు అయింది. చాపురంలోని సత్యసాయినగర్‌లో రూ.4 కోట్ల విలువైన భూమిని సీతారాం కుటుంబం నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకుందంటూ జూలై 15వ తేదీన పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు 8 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ప్రాంతంలో గతంలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన అరుణపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆ కుటుంబం రిజిస్ట్రేషన్ చేయిం చుకున్న భూమి యజమాని గోవింరాజులు పేరిట 900 గజాల స్థలం ఉంది. ఆయన బతికి ఉండగానే మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఆముదాలవలసలో భూమిని తమ్మినేని సీతా రాం కుటుంబం రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఈ నేపథ్యంలో గోవిందరాజులు అల్లుడు కనకలింగేశ్వరరావు పోలీసులను ఆశ్ర యించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టా రు. అందులో భాగంగా తమ్మినేని సీతారాం ఫ్యామిలీపై కేసు నమోదు చేశారు.

# పరిశ్రమల రాకతో స్థానికంగానే ఉద్యోగాలు

- సీఎం చంద్రబాబు కృషితో విస్తృతంగా పరిశ్రమల ఏర్పాటు
- విద్య పూర్తికాగానే నివాసమున్నచోటే ఉపాధి
- నీరా యూనిట్ల ఏర్పాటుతో వ్యాపారులుగా గీత కార్మికులు
- ఈడిగల ఉన్నతే సీఎం చంద్రబాబు లక్ష్యం
- ఈడిగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీలో మంత్రి సవిత

హిందూపురం/ శ్రీసత్యసాయి (చైతన్య రథం): ఉన్నత విద్య పూర్తి కాగానే స్థానికంగానే ఉద్యోగాలు లభించేలా కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ బిడ్డలు ఉన్నత స్థానాల్లో ఉండాలన్న సంకల్పంతో సివిల్ సర్వీసెస్, డిఎస్సీ వంటి పరీక్షలకు బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ అందజేస్తున్నామన్నారు. ఈడిగలు, గౌడలను అన్నిరంగాల్లో రాణించేలా సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నీరా యూనిట్లు స్థాపించనున్నారని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో ఆదివారం ఈడిగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. గీత కార్మికుల సంక్షేమానికి ఆది నుంచి సీఎం చంద్రబాబునాయుడు ప్రాధాన్యమిస్తూ వస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. మద్యం దుకాణాల లైసెన్స్ ఫీజులో 50 శాతం మేర రాయితీ ఇచ్చారన్నారు. 50 ఏళ్లు దాటిన గీత కార్మికులకు పింఛన్ అందజేసిన ఘనత కూడా సీఎం చంద్రబాబుదేనన్నారు. గీత కార్మికులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా నీరా యూనిట్లు స్థాపించాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారని మంత్రి సవిత తెలిపారు.




**నివాసం ఉన్న చోటే ఉద్యోగాలు**

బీసీ బిడ్డలకు ఉన్నత విద్య అందించడంతో పాటు ఉన్నత స్థానాల్లో కూడా నిలవాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. ఇందుకోసం సివిల్ సర్వీసెస్, డీఎస్సీ, గ్రూప్ 2 సహా ఇతర పోటీ పరీక్షలకు బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత చదువులు చదివి పొట్టచేత పట్టుకుని నిరుద్యోగులు ఉద్యోగాలకు వలసలు వెళ్లే బాధలు తప్పేలా సీఎం చంద్రబాబు రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. విద్యాభ్యాసం పూర్తి కాగానే, స్థానికంగా ఉద్యోగాలు లభించేటట్లు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పరిశ్రమలు నెలకొల్పుతున్నారని మంత్రి సవిత వెల్లడించారు.

**హిందూపురం నందమూరి అడ్డా...**

హిందూపురం నియోజక వర్గం నందమూరి వంశీయులకు అడ్డాగా మారిందని మంత్రి అన్నారు. ఆనాడు అన్న ఎన్టీఆర్... నేడు లెజెండరీ నటుడు నందమూరి బాలకృష్ణకు హిందూపురం ఆదరిస్తూ వస్తోందన్నారు. హిందూపురం అభివృద్ధి ఎమ్మెల్యే బాలకృష్ణ అవిరళ కృషి చేస్తున్నారన్నారు. నియోజక వర్గంలో పరిశ్రమల స్థాపనతో పాటు మౌలిక సదుపాయాలను కూడా పెద్ద ఎత్తున కల్పిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు.

**విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు**

టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఈడిగ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు మంత్రి సవిత చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఇంటర్ లో 80 శాతం మార్కులుపై పైబడిన సాధించిన ఈడిగ విద్యార్థులకు రూ.10 వేలు, 80 శాతం కంటే తక్కువ వచ్చిన విద్యార్థులకు రూ.8 వేల చొప్పున అందజేశారు. ఇంటర్ లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ల్యాప్ ట్యాప్ లను మంత్రి సవిత అందజేశారు. టెన్త్ లో 80 శాతం మార్కులు సాధించిన ఈడిగ విద్యార్థులకు రూ.5 వేల చొప్పున అందజేశారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు రూ.15 వేల చొప్పున అందజేశారు. 80 శాతం కంటే తక్కువ వచ్చిన విద్యార్థులకు రూ.3 వేల చొప్పున అందజేశారు. ప్రతిభా పురస్కారాలు అందజేసిన ఈడిగ సామాజిక సంక్షేమ సంఘ ప్రతినిధులను మంత్రి సవిత అభినందించారు. విద్యార్థులు విద్య పట్ల పూర్తి స్థాయి దృష్టి సారించాలని, తల్లిదండ్రుల ఆశలు నెరవేరుస్తూ అనుకున్న లక్ష్యాలకు చేరాలని మంత్రి సవిత ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కిరణ్ కుమార్ హరికృష్ణ, గోపాల్, మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య గౌడ్, అధిక సంఖ్యలో ఈడిగ సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

# భళా.. టాలీవుడ్!

**- నేషనల్ అవార్డీలకు మంత్రి దుర్గేష్ అభినందనలు**
**- నేషనల్ ఫిల్మ్స్‌లో 9 అవార్డులతో టాలీవుడ్ సత్తా చూపడంపై ఆనందం**



అమరావతి (చైతన్య రథం): 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలలో టాలీవుడ్ ఏకంగా 9 జాతీయ అవార్డులను కైవసం చేసుకుని దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించడంపై సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. "భారతీయ చలనచిత్ర రంగంలో తెలుగు సినిమా మరోసారి తన జైత్రయాత్రను చాటిచెప్పడం ఆనందంగా ఉంది. నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వేదికపై 9 పురస్కారాలతో టాలీవుడ్ తన విశ్వరూపాన్ని ప్రదర్శించడం ప్రతి ఒక్క తెలుగువారికీ గర్వకారణం. ముఖ్యంగా నిహారిక కొణిదెల సమర్పణలో, పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ మరియు శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్లపై యువ ప్రతిభతో తెరకెక్కిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రంగా ఎంపిక కావడం అభినందనీయం. పల్లెటూరి నేపథ్యంలో స్నేహం, కుటుంబ బంధాలు, సామాజిక విలువలు, భావోద్వేగాలను వెండితెరపై ఆవిష్కరించి జాతీయ అవార్డును అందుకోవడం ఈ చిత్ర బృందం సాధించిన ఘన విజయం" అని కొనియాడారు. తెలుగు సినిమా కేవలం కమర్షియల్ హంగులకే పరిమితం కాకుండా.. కథ, కథనం, నటన, సాంకేతిక నైపుణ్యం, కాస్ట్యూమ్ డిజైనింగ్, మేకప్ మరియు అద్భుతమైన నిర్మాణ విలువలు.. ఇలా 24 క్రాఫ్ట్‌ల్లోనూ తన తిరుగులేని ప్రతిభను చాటుకుందని మంత్రి దుర్గేష్ ప్రశంసించారు. వెండితెరపై తెలుగు వారి సృజనాత్మకతకు, కష్టానికి దక్కిన గౌరవం ఈ జాతీయ పురస్కారాలని ఆయన పేర్కొన్నారు. భారతీయ చలనచిత్ర యవనికపై మన సినిమా కీర్తి పతాకాన్ని ఎగురవేసి, తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడేలా చేసిన నటులు, దర్శకులు, నిర్మాతలు మరియు సాంకేతిక నిపుణులతో కూడిన చిత్ర బృందాలన్నింటికీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఈ ప్రకటన ద్వారా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో తెలుగు సినిమా మరిన్ని అంతర్జాతీయ శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

# హాస్టళ్లలో సకల సదుపాయాలు

**మంచిగా చదవడమే మీ పని.. విద్యార్థులకు మంత్రి సూచన**

బనగానపల్లె (చైతన్య రథం): సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు రోడ్లు భవనాల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నతస్థానాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆదివారం బనగానపల్లె బీసీ హాస్టల్‌ను సందర్శించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థినిలకు ఉచిత స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. బెడ్ షీట్, టవల్, నైట్ డ్రెస్, స్పోర్ట్స్ షూలతో కూడిన స్కూల్ కిట్లను విద్యార్థులకు అందజేసిన మంత్రి, హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోరిక మేరకు స్కూల్లో డివిడి ప్లేయర్ ఏర్పాటు చేస్తామని తెలిపిన మంత్రి, మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మత్తులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. "ముఖ్యంగా నేటి విద్యార్థులు సెల్ ఫోన్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. చదువుతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది. వార్డెన్లు, సిబ్బంది హాస్టళ్లలో విద్యార్థులను తమ సొంత పిల్లల మాదిరిగా చూసుకోవాలి. శుచి, శుభ్రత, నాణ్యతతో కూడిన ఆహారం విద్యార్థులకు అందించాలి. ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తున్న క్రమంలో.. విద్యార్థులకు ఏ విధమైన లోటు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉంటుంది" అని సూచించారు.



# హిందూ ఆలయాలపై దాడులు మరువద్దు

**- విజయవాడ రౌండ్‌టేబుల్‌లో సాధు సంతుల పిలుపు**
**- దాడులపై సాధు పరిషత్ ఆగ్రహం.. ప్రభుత్వానికి సూచనలు**

విజయవాడ (చైతన్య రథం): సనాతన ధర్మంపై జరుగుతున్న దాడులు, హిందువులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించేందుకు ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడ బెంజ్ సర్కిల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించింది. సమావేశంలో సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసానంద సరస్వతి, గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావుతో పాటు వివిధ ప్రాంతాలనుంచి సాధువులు, పీఠాధిపతులు హాజరయ్యారు. "రాష్ట్రంలో సనాతన ధర్మం ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించి, వాటి పరిష్కారానికి ప్రభుత్వానికి సూచనలు చేయడమే రౌండ్‌టేబుల్ సమావేశం ప్రధాన ఉద్దేశమని" అట్లూరి నారాయణరావు అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ప్రజా సమస్యలకంటే సనాతన ధర్మానికి సంబంధించిన అంశాలపైనే ఎక్కువగా దృష్టి సారిస్తూ, హిందూ మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇటీవల కొందరు వ్యక్తులు శ్రీరాముడు, సీతాదేవి, ఇతర హిందూ దేవతలు, భగవద్గీతపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ వాటిని తీవ్రంగా ఖండించారు. కొన్ని వేదికల ద్వారా హిందూ దేవతలు, సనాతన ధర్మాన్ని అవమానించే వ్యాఖ్యలకు ప్రోత్సాహం లభిస్తోందని ఆరోపించిన నారాయణరావు, అలాంటి చర్యలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రశ్న రావణ్, జడ శ్రవణ్‌లాంటి వ్యక్తులు దళిత క్రైస్తవ సభ పేరిట ఇటీవలి కాలంలో చేసిన సనాతన ధర్మంపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ.. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని.. ఒకవేళ ఇలాంటి సంఘటన తిరిగి జరిగితే వారిపై ప్రశ్న రావణ్‌పై పెట్టినటువంటి కేసులతో శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాల్సిన ప్రతిపక్షం తన పాత్రను వదిలేసి, రాష్ట్రంలో కులాల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే సభలకు ఆర్థిక సహాయం అందిస్తూ సనాతన ధర్మంపై దాడికి వంతపాడుతోంది ని తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షం మతవిద్వేషాలకు పోకుండా ప్రజా సమస్యలపై పోరాడాలని అట్లూరి నారాయణరావు హితవు పలికారు.

**గత ప్రభుత్వ హయాంలో దాడులు మర్చిపోవద్దు: స్వామి శ్రీనివాసానంద సరస్వతి**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులు, విగ్రహాల ధ్వంసం, రథాల దహనం వంటి ఘటనలను హిందూ సమాజం మరవొద్దని స్వామి శ్రీనివాసానంద సరస్వతి పిలుపునిచ్చారు. రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహం ధ్వంసం, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి రథం దగ్ధం, నెల్లూరు ప్రసన్న వెంకటేశ్వరస్వామి రథం దహనం, పిఠాపురంలో ఆలయాలపై దాడులు వంటి ఘటనలను ఆయన ప్రస్తావించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, హిందూ సంప్రదాయాలు, ఆలయాలపట్ల తగిన గౌరవం చూపలేదని ఆయన పేర్కొన్నారు. తిరుమల బ్రహ్మోత్సవాలు, కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సంప్రదాయాలను పాటించలేదని విమర్శించారు. ఇటీవల శ్రీరాముడు, సీతాదేవి తదితర హిందూ దేవతలపై జరిగిన వివాదాస్పద వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఆయన, వాటిని సమర్థించిన వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ ధర్మం, దేవాలయాల పరిరక్షణకు ప్రతి హిందువు అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్రంలో సామరస్య వాతావరణాన్ని కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు.

# చేనేతకు కొత్త వెలుగు.. జౌళి రంగానికి కొత్త దిశ

**- సంక్షేమం నుంచి ప్రపంచ మార్కెట్ వరకు...**
**- రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ చేనేత రంగం ప్రయాణం**




**ఆంధ్రప్రదేశ్ చేనేత రంగాన్ని సంక్షేమ పరిధి నుంచి పరిశ్రమ స్థాయికి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపట్టింది. టెక్స్‌టైల్స్ పాలసీ-2024-29 ద్వారా రూ.10 వేల కోట్ల పెట్టుబడులు, రెండు లక్షల ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా నిర్దేశించారు. నేతన్నలకు పెన్షన్ పెంపు, ఉచిత విద్యుత్, సబ్సిడీ నూలు వంటి సంక్షేమ చర్యలతో పాటు, నకిలీలకు అడ్డుకట్ట వేసేందుకు క్యూఆర్ కోడ్ వ్యవస్థను అమలు చేస్తున్నారు. ఆప్కో ఆధునీకరణ, ఈ-కామర్స్ విస్తరణ, క్లస్టర్ల ఏర్పాటుతో మార్కెటింగ్‌కు కొత్త బలం చేకూరుస్తున్నారు. భారత్ టెక్స్-2026లో కుదిరిన ఒప్పందాలతో వేల కోట్ల పెట్టుబడులకు మార్గం సుగమమైంది.**

ఆంధ్రప్రదేశ్‌కు వ్యవసాయం ఎంత గుర్తింపునిస్తే, చేనేత కూడా అంతే ప్రత్యేకమైన వారసత్వాన్ని అందించింది. ధర్మవరం పట్టుచీరలు, ఉప్పాడ జరీ, మంగళగిరి వస్త్రాలు, వెంకటగిరి నూలు, చీరాల వస్త్రాలు, నరసాపురం లేస్... ఇవన్నీ కేవలం ఉత్పత్తులు కాదు. రాష్ట్ర సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన జీవంతమైన కళారూపాలు. వేలాది కుటుంబాలకు జీవనాధారం. అయితే కాలక్రమేణా ముడి నూలు ధరల పెరుగుదల, మార్కెటింగ్ లోపాలు, మధ్యవర్తుల ఆధిపత్యం, నకిలీ ఉత్పత్తులు, ఆధునిక డిజైన్ల కొరత, యువత వృత్తికి దూరమవడం వంటి కారణాలతో చేనేత రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. అనేక ప్రాంతాల్లో మగ్గాలు మూగబోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో చేనేతను కేవలం సంక్షేమ కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, పరిశ్రమగా అభివృద్ధి చేయాలనే దిశగా కూటమి ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది.

**సంక్షేమం నుంచి స్థిరమైన అభివృద్ధి వైపు**

ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన "కూడు-గూడు-గుడ్డ" భావనను కొనసాగిస్తూ ప్రస్తుతం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం చేనేతకు కొత్త దిశ నిర్దేశించే ప్రయత్నం చేస్తోంది. నేతన్నలకు కేవలం సబ్సిడీలు అందించడం మాత్రమే కాకుండా, ఏడాది పొడవునా ఉపాధి, స్థిరమైన ఆదాయం, ఆధునిక మార్కెట్, అంతర్జాతీయ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ ఆలోచనకు ప్రతిరూపంగానే ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్, అప్పారెల్ అండ్ గార్మెంట్స్ పాలసీ-2024-29 రూపొందించబడింది. రాష్ట్రంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు, రెండు లక్షలకు పైగా ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా ఈ విధానం రూపొందించారు. చేనేత నుంచి గార్మెంట్ తయారీ వరకు మొత్తం విలువ గొలుసును రాష్ట్రంలోనే అభివృద్ధి చేయాలన్న లక్ష్యం ఇందులో కనిపిస్తోంది.

**నేతన్న సంక్షేమానికి కొత్త బలం**

చేనేత కుటుంబాలకు వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా కల్పించేందుకు 93 వేల మందికి 50 ఏళ్ల వయస్సు నుంచే పెన్షన్ అందిస్తూ, నెలవారీ పెన్షన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడం ప్రభుత్వం తీసుకున్న ప్రధాన నిర్ణయాల్లో ఒకటి. అదే సమయంలో త్రిఫ్ట్ పథకానికి ప్రతి ఏడాది ప్రత్యేక నిధులు కేటాయిస్తూ పొదుపు అలవాటును ప్రోత్సహిస్తోంది. ముడి నూలు ధరల భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వ రా మెటీరియల్ సప్లై స్కీమ్ ద్వారా రెండేళ్లలో రూ.246 కోట్లకు పైగా విలువైన నూలును 15 శాతం సబ్సిడీపై సరఫరా చేయడం ద్వారా నేతన్నల ఉత్పత్తి వ్యయం గణనీయంగా తగ్గింది. అదే విధంగా 50 వేలకు పైగా చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తూ మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచితంగా ఇవ్వడం వల్ల ఉత్పత్తి వ్యయం తగ్గి ఆదాయం పెరిగే పరిస్థితి ఏర్పడింది.

**వేతనాలు, పనిముట్లు, మహిళలకు ప్రోత్సాహం**

రంగులు వేయడం, బ్లీచింగ్, బెడ్‌షీట్లు, టవల్స్ నేసే కార్మికుల వేతనాలను ప్రభుత్వం పెంచింది. 90 శాతం సబ్సిడీతో పనిముట్లు, ముద్ర రుణాల ద్వారా రూ.65 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించింది. మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేకంగా యార్న్ పంపిణీ చేయడం ద్వారా మహిళా నేతన్నలకు అదనపు ప్రోత్సాహం కల్పించింది.

**నకిలీ వస్త్రాలకు అడ్డుకట్ట**

చేనేత రంగానికి పెద్ద సవాలుగా మారిన నకిలీ వస్త్రాల నియంత్రణ కోసం ప్రభుత్వం వస్త్రాలపై క్యూఆర్ కోడ్ వ్యవస్థను అమలు చేస్తోంది. వస్త్రాన్ని తయారు చేసిన నేత, సహకార సంఘం వంటి వివరాలను వినియోగదారుడు తెలుసుకునే అవకాశం కల్పించడం ద్వారా అసలైన చేనేతకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తోంది.

**ఆప్కోకు కొత్త ఊపిరి**

చేనేత మార్కెటింగ్‌కు ప్రధాన వేదిక అయిన ఆప్కోను ప్రభుత్వం ఆధునీకరిస్తోంది. డిజిటల్ బిల్లింగ్, కంప్యూటరీకరణ, నిల్వల నిర్వహణలో పారదర్శకత, కొత్త షోరూమ్‌ల ఏర్పాటు వంటి చర్యలతో ఆప్కోను ఆధునిక మార్కెటింగ్ సంస్థగా తీర్చిదిద్దుతోంది. ఈ సంస్కరణలకు గుర్తింపుగా స్కోచ్ అవార్డు-2025 లభించింది. గత రెండేళ్లలో రూ.190 కోట్లకు పైగా అమ్మకాలు నమోదు కావడం ఈ మార్పులకు నిదర్శనం.

**డిజిటల్ మార్కెట్‌లోకి చేనేత**

ఈ-కామర్స్ వేదికలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో వేలాది చేనేత ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రాష్ట్ర చేనేతకు ప్రపంచ మార్కెట్ తలుపులు తెరుచుకున్నాయి. మధ్యవర్తుల ప్రమేయం తగ్గి, నేరుగా వినియోగదారుడికి చేరే అవకాశం కలగడంతో నేతన్నలకు మెరుగైన ఆదాయం లభించే పరిస్థితి ఏర్పడుతోంది. అదే సమయంలో ఆద్యం, టాటా తనేరియా, కో-ఆప్టెక్స్ వంటి సంస్థలతో మార్కెటింగ్ భాగస్వామ్యాలు, తిరుమల తిరుపతి దేవస్థానంతో ఒప్పందాలు చేనేత ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్‌ను కల్పించే దిశగా కీలక అడుగులుగా భావించవచ్చు.

**క్లస్టర్లు... పరిశ్రమగా చేనేత**

చేనేతను కుటుంబ వృత్తి నుంచి సంఘటిత పరిశ్రమగా మార్చేందుకు ప్రభుత్వం క్లస్టర్ విధానాన్ని అమలు చేస్తోంది. ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్, మంగళగిరి, పిఠాపురం చేనేత పార్కులు, విశాఖలో పీఎంఏక్తా మాల్, శిఖమూరులో హ్యాండ్లూమ్-హ్యాండీక్రాఫ్ట్స్ మ్యూజియం వంటి ప్రాజెక్టులు దీర్ఘకాలిక అభివృద్ధికి బాటలు వేస్తున్నాయి.

**భారత్ టెక్స్-2026... ప్రపంచానికి ఏపీ పరిచయం**

దేశంలో అతిపెద్ద టెక్స్‌టైల్ ప్రదర్శన భారత్ టెక్స్-2026లో ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ పెట్టుబడిదారులకు రాష్ట్ర టెక్స్‌టైల్ రంగంలోని అవకాశాలను వివరించింది. ఈ సందర్భంగా కుదిరిన మూడు కీలక అవగాహన ఒప్పందాలు రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులకు మార్గం సుగమం చేశాయి. రూ.4 వేల కోట్లతో టెక్స్‌టైల్ రీసైక్లింగ్ ప్రాజెక్టు, విశాఖలో ఆధునిక గార్మెంట్ యూనిట్, నైపుణ్యాభివృద్ధి కోసం కేప్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం రాష్ట్ర చేనేత రంగానికి కొత్త అవకాశాలను తెరుస్తున్నాయి.

**హస్తకళలకు ప్రపంచ గుర్తింపు**

చేనేతతో పాటు హస్తకళల అభివృద్ధికీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోంది. "లేపాక్షి" బ్రాండ్‌ను దేశ, విదేశీ మార్కెట్లలో విస్తరించే దిశగా చర్యలు చేపట్టింది. ఆధునిక షోరూమ్‌లు, ఈ-కామర్స్ వేదికలు, అంతర్జాతీయ ప్రదర్శనల ద్వారా హస్తకళ ఉత్పత్తులకు కొత్త మార్కెట్లు లభిస్తున్నాయి. రాష్ట్రంలో రెండు లక్షలకు పైగా హస్తకళాకారులను వ్యవస్థీకృతంగా అభివృద్ధి చేయడం, క్లస్టర్ల ఏర్పాటు, జీఐ ట్యాగ్‌ల సాధన, జాతీయ అవార్డులు రాష్ట్ర కళాకారుల ప్రతిభకు కొత్త గుర్తింపు తీసుకొచ్చాయి.

**గ్రామీణ ఉపాధికి ఖాదీ బలం**

ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం ద్వారా వేలాది యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, కాగితం, కొవ్వొత్తుల తయారీ వంటి శిక్షణా కార్యక్రమాలను విస్తరించింది.

**పారిశ్రామిక దృష్టితో కొత్త కార్యాచరణ**

చేనేత రంగంలో గతంలో సంక్షేమ చర్యలే ప్రధానంగా కనిపించగా, ప్రస్తుతం సంక్షేమంతో పాటు పెట్టుబడులు, పరిశ్రమలు, మార్కెటింగ్, డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి, ఎగుమతులు వంటి అన్ని అంశాలను ఒకే వ్యూహంలో అనుసంధానం చేసే ప్రయత్నం జరుగుతోంది. దీనివల్ల చేనేత రంగం సంప్రదాయ వృత్తి నుంచి పోటీ సామర్థ్యం కలిగిన ఆధునిక పరిశ్రమగా రూపాంతరం చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**భవిష్యత్‌కు బలమైన పునాది**

ఆంధ్రప్రదేశ్ చేనేత చరిత్ర అనేది కేవలం వస్త్రాల చరిత్ర కాదు. అది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. ప్రతి నూలుపోగులో ఒక కుటుంబం ఆశ ఉంటుంది. ప్రతి మగ్గం వెనుక ఒక కళాకారుడి జీవిత అనుభవం ఉంటుంది. అలాంటి రంగాన్ని నిలబెట్టడం అంటే ఒక సంస్కృతిని, ఒక వారసత్వాన్ని కాపాడినట్లే. గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన చర్యలను పరిశీలిస్తే చేనేతను సంక్షేమ రంగం నుంచి అభివృద్ధి రంగంగా, అక్కడి నుంచి ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానించే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రకటించిన ప్రాజెక్టులు, పెట్టుబడులు, క్లస్టర్లు, మార్కెటింగ్ సంస్కరణలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు పూర్తి స్థాయిలో అమలైతే ఆంధ్రప్రదేశ్ మరోసారి దేశ చేనేత రంగానికి దిశానిర్దేశం చేసే రాష్ట్రంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయి. చేనేత బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. నేతన్న నిలబడితే సంప్రదాయం నిలుస్తుంది. ఆ సంప్రదాయాన్ని ఆధునిక సాంకేతికత, ప్రపంచ మార్కెట్, పెట్టుబడులతో అనుసంధానం చేయగలిగితేనే ఆంధ్రప్రదేశ్ చేనేత రంగానికి నిజమైన స్వర్ణయుగం ప్రారంభమైనట్లవుతుంది.

**- జమ్ము సాయి కళ్యాణ్,**
**అనలిస్టు, తెలుగుదేశం పార్టీ నాలెడ్జ్ సెంటర్**

# మాట నిలుపుకున్న డిప్యూటీ సీఎం

**బల్లగరువు, వెలగపాడు, కొరపర్తిలో రూ.కోటితో మౌలిక వసతులు**

అమరావతి (చైతన్య రథం): గిరిజన గ్రామాల అభివృద్ధిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం బల్లగరువు గ్రామ పర్యటన సందర్భంగా గిరిపుత్రులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. కోటి రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. అంగన్వాడీ కేంద్రాలు, తాగునీటి సదుపాయం, సీసీ రోడ్లు తదితర వసతులు డిప్యూటీ సీఎం చొరవతో అందుబాటులోకి వచ్చాయి. గిరిజన గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు ఆయన అనంతగిరి మండలం బల్లగరువుకు వెళ్లారు. పర్యటనలో భాగంగా వెలగపాడు, కొరపర్తి తదితర గ్రామాల్లో గిరిజనులతో మమేకమయ్యారు. సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కార్యరూపమిస్తూ నేడు పనులు పూర్తి చేశారు.




**మూడు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం**

గిరిజన ప్రాంతాల్లో నివసించే మహిళలు, చిన్నారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బల్లగరువు, వెలగపాడు, కొరపర్తి గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను నిర్మించారు. డిప్యూటీ సీఎం ఆయా గ్రామాలను సందర్శించిన సమయంలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు సరైన భవనం లేక చిన్నారులు పడుతున్న ఇబ్బందులు గుర్తించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సమస్యలు తీర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు.

చిన్నారులు, మహిళల కోరిక మేరకు మూడు అంగన్వాడీ భవనాలను రూ.55 లక్షలు వెచ్చించి నిర్మించారు. అందులో బల్లగరువు, వెలగపాడుల్లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంతో నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. గిరిజనాభివృద్ధి శాఖ ఇంజినీరింగ్ విభాగం సహకారంతో కొరపర్తిలో అంగన్వాడీ భవనానికి ప్రహరీ గోడ, ఎంపీపీ స్కూలు భవనం పునరుద్ధరణ, తాగునీటి కోసం బోరు, నీటి సరఫరా నిమిత్తం పైప్‌లైన్లు, గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

చైతన్యరథం

# విశాఖలో ఘనంగా ఓపిఎస్ ఉద్యోగుల కృతజ్ఞతాభివందన సభ

## సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఉద్యోగుల క్షీరాభిషేకం..

## థాంక్ యూ సీఎం సార్ అంటూ హోరెత్తిన నినాదాలు

## పాల్గొన్న ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు




విశాఖపట్నం (చైతన్యరథం): చేసిన మంచి పనికి కృతజ్ఞత చెప్పాలనే గొప్ప సాంప్రదాయానికి ఉత్తరాంధ్ర ఉద్యోగులు తెరతీసి ఆంధ్ర రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని శాసన మండలి ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు అన్నారు. సీపీఎస్ నుండి ఓపిఎస్‌కు మారిన ఉత్తరాంధ్ర ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆదివారం విశాఖలోని స్వర్ణభారతి స్టేడియంలో కృతజ్ఞతాభివందన సభను విజయవంతంగా నిర్వహించారు. రాష్ట్రంలో వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కలను సాకారం చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) అమలు చేసినందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ఆజన్మాంతం రుణపడి ఉంటామని పలువురు ప్రభుత్వ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పట్టభద్రుల ఎమ్మెల్సీలు ఆలపాటి రాజా, కంచర్ల శ్రీకాంత్, పేరాబత్తుల రాజశేఖర్ హాజరయ్యారు.

ఎపి డిఎస్సీ ఫోరం, నోబుల్ టీచర్స్ అసోసియేషన్, పి.ఆర్.టి.యు, ఎపిటిఎఫ్ తదితర ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో తొలుత ఓపిఎస్ లబ్ది పొందిన ఉద్యోగులు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి సుమారు 15 వేల మంది ఈ సభకు హాజరయ్యారు. "థాంక్ యూ సిఎం సర్.. సముద్రమంతా ఆనందం, కుటుంబాలతో మేమందరం" అంటూ ఉద్యోగులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. శాసన మండలి ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ, ఉద్యోగులకు రిటైర్మెంట్ ఉంటుంది కానీ కుటుంబాలకు రిటైర్మెంట్ ఉండదని పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి 11 వేల మంది కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఆర్థిక భద్రత కల్పించి ఆయురారోగ్యాలను పెంచిందని స్పష్టం చేశారు. 2019-24 మధ్యకాలంలో రాష్ట్రంలో చీకటి యుగం నడిచిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులు డిఏలు, మెడికల్ బిల్లులు కూడా మర్చిపోయారని గుర్తు చేశారు. గతంలో ఉపాధ్యాయుల జీతాలు చాలా తక్కువగా ఉండేవని, రెవెన్యూ ఉద్యోగులతో సమానంగా ఉపాధ్యాయుల జీతాలు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని కొనియాడారు. 2004 నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొంది, సాంకేతిక కారణాల వల్ల 2004 తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులకు ఓపిఎస్ విధానాన్ని, ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ ఇచ్చిన ఘనత చంద్రబాబు గారికే దక్కుతుందన్నారు. సింగపూర్ తరహాలో రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే స్థిరమైన పాలన అవసరమని అన్నారు. ఆంధ్ర రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే చంద్రబాబు గారి సారథ్యంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలు స్థిరమైన పాలన అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వాములని, 2029 లో ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే విధంగా ఉద్యోగులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల కోసం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసే క్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యం కీలకమైనదని అన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పరిపాలనలో చంద్రబాబు నాయుడుకు అపారమైన అనుభవం ఉందని, భవిష్యత్తు తరాలకు బాటలు వేయడానికి కూటమి ప్రభుత్వానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు అండగా నిలవాలని కోరారు. స్వర్ణాంధ్ర లక్ష్యంతోనే సీఎం పనిచేస్తున్నారని చెబుతూ, 2029 లక్ష్యంతో అందరూ ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

శాసనసభ్యులు విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, గత వైకాపా ప్రభుత్వం మద్యం దుకాణాల దగ్గర క్యూలైన్లను నియంత్రించడానికి ఉపాధ్యాయులను నియమించి వారిని అగౌరవపరిచిందని చెప్పారు. 2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో దుర్మార్గ పాలన సాగిందన్నారు.

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ, ఉద్యోగులకు మేలు చేసే ఎటువంటి కార్యక్రమానికి అయినా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులుగా తాము ఒకే తాటిపై ఉంటూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని అన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీలు ఆలపాటి రాజా, కంచర్ల శ్రీకాంత్, పేరాబత్తుల రాజశేఖర్ లు మాట్లాడుతూ, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను విప్ వేపాడ చిరంజీవిరావు సారథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు నిరంతర కృషి జరుపుతున్నామని చెప్పారు. పలువురు ఓపిఎస్ ఉద్యోగులు మాట్లాడుతూ, చంద్రబాబు తమకు పాత పెన్షన్ విధానంతో పునర్జన్మ ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. సభలో ఓ ఉద్యోగి ఆరేళ్ల కుమార్తె మాట్లాడుతూ, "పెన్షన్ రావడంతో మా నాన్న చాలా సంతోషంగా ఉన్నారు, రోజూ పెన్షన్ ఇస్తే బాగుండును" అని అమాయకంగా చెప్పిన మాటలతో సభాప్రాంగణం చప్పట్లతో మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు అతిథులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఉద్యోగ సంఘాల నేతలు ఎం.శ్రీనివాసరావు, గోపినాథ్, ఆర్.అప్పలరాజు, కేవల్ ప్రసాద్, బలగ శ్రీనివాస్, సుబ్బారెడ్డి, డాక్టర్ బి. గోవింద నాయుడు తదితరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి, కూటమి ప్రభుత్వ నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# 22న నసనకోట ఎంజేపీలో ఇంటర్మీడియట్ క్లాసులు ప్రారంభం

## పాల్గొంటున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు (చైతన్యరథం): రామగిరి మండలం నసనకోట ఎంజేపి గురుకుల బాలికల పాఠశాలలో ఈనెల 22వ తేదీన ఇంటర్మీడియట్ కళాశాల ప్రారంభం కానుంది. ఇప్పటికే ఇక్కడ ఇంటర్మీడియట్ కు అనుమతిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అడ్మిషన్ల ప్రక్రియ కూడా దాదాపుగా పూర్తయింది. ఈనెల 22వ తేదీ నుంచి క్లాసులు ప్రారంభం కానున్నాయి. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి ఇంటర్మీడియట్ తరగతులను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఎంజెపి గురుకుల పాఠశాలను పరిశీలించారు. అక్కడ ప్రతి విభాగాన్ని పరిశీలించి... అక్కడ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈనెల 22వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహించనునట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో బాలికలకు ఇంటర్మీడియట్ రెసిడెన్షియల్ విద్య అందించాలన్నది ఒక కలగా ఉండేదని ఈనెల 22వ తేదీన అది సాకారం కానుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగదిలో ఈ పూట వండిన భోజనం, కూరలను, పరిశు భ్రతను పరిశీలించారు , స్టోర్ రూమ్ లో కూరగాయల నాణ్యత, కిరాణా సరుకులు, వాటి కాల పరిమితిని పరిశీలించారు. పిల్లలకు భోజనంలో తాజా ఆకుకూరలు కూరగాయలను మాత్రమే వాడాలని, కాల పరిమితి పూర్తి అయిన కిరణా సరుకులను వాడవద్దని సూచించారు.








సింహాచలం దేవస్థాన సత్రంలో విద్యార్ధులకు అందిస్తున్న అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం, వారికి కావలసిన సదుపాయాల గురించి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, కళాశాలల ప్రిన్సిపల్స్ తో కలిసి చౌల్ట్రీ ని సందర్శించి అనంతరం సమావేశం నిర్వహించిన శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు

# బ్రాహ్మణ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట



## ఏపీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్
## రాజమహేంద్రవరంలో ఘనంగా రాష్ట్ర బ్రాహ్మణ ఆత్మీయ మహాసభ



రాజమహేంద్రవరం పుణ్య గోదావరి తీరాన సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర బ్రాహ్మణ ఆత్మీయ మహాసభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్ మాట్లాడుతూ, బ్రాహ్మణ సమాజ అభ్యున్నతి, సనాతన ధర్మ పరిరక్షణ, ఆర్థిక సాధికారతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

మహాసభ ప్రాంగణంలో బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ రాజమహేంద్రవరం డైరెక్టర్ తేజోమూర్తుల నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రత్యేక స్టాల్‌ను చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రెడిట్ సొసైటీ ద్వారా బ్రాహ్మణ కుటుంబాలకు స్వయం ఉపాధి, ఆర్థికాభివృద్ధి, రుణ సదుపాయాల కల్పనలో విశేష సేవలు అందిస్తున్నట్లు ఆయన కొనియాడారు. ప్రతి అర్హులైన బ్రాహ్మణ కుటుంబం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జరిగిన రాష్ట్ర బ్రాహ్మణ ఆత్మీయ మహాసభలో ప్రసంగించిన చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆగమ శాస్త్రాలు, ఆలయ సంప్రదాయాలు, సనాతన ధర్మానికి తగిన ప్రాధాన్యం లభించలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమానికి పెద్దపీట వేస్తూ విద్య, స్వయం ఉపాధి, వేద పండితులు, అర్చకుల సంక్షేమం, మహిళల సాధికారత, విద్యార్థుల ఉన్నత విద్య కోసం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. బ్రాహ్మణ యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా స్వయం ఉపాధి రంగంలోనూ రాణించాలని, ఆ దిశగా బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్, బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా అన్ని విధాలా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్లు తేజోమూర్తుల నరసింహమూర్తి, చెరుకుపల్లి సంతోష్, కొలిచిన పద్మ, సబ్బని విస్సు కృష్ణమోహన్, అకెళ్ల వెంకటనారాయణమూర్తి, పీవీ ఫణికుమార్, చివుకుల దుర్గాప్రసాద్, వెలగలేటి గంగాధర్, సాధికార సమితి సభ్యులు గుడూరు శేఖర్, గార్లపాటి విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పనాల సంతోషి, శ్రీ మామిళ్లపల్లి అయ్యప్ప, భువనగిరి వెంకటరమణ, బీజేపీ నాయకుడు చైతన్య శర్మ, అన్నవరం దేవస్థానం బోర్డు సభ్యురాలు శిరీష, వాడపల్లి దేవస్థానం బోర్డు సభ్యురాలు పెండ్యాల భవాని, బ్రాహ్మణ పెద్దలు, వేద పండితులు, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, బ్రాహ్మణ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 20 ఏళ్ల సమస్యకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): దాదాపు రెండు దశాబ్దాలుగా స్థానిక ప్రజలను వేధిస్తున్న సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామన్నారు. స్థానిక 39వ డివిజన్ లింగంపేట రెండో వీధిలో రూ.13.50 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 39వ డివిజన్లో ఇప్పటికే రూ.2.60 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మరో రూ.52 లక్షల విలువైన పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ పనులు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక నాయకుల ప్రతిపాదనల మేరకు చేపడుతున్నామని చెప్పారు. లింగంపేటలోని దేవాలయం వద్ద కల్వర్టు ఎత్తు పెంపు, రోడ్డు ఎత్తు పెంపు వంటి పనులు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే డివిజన్ ఇన్‌చార్జి ప్రదీప్ ప్రతిపాదించిన మరో మూడు ప్రాంతాల్లో కూడా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, దాదాపు 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ఇప్పుడు పరిష్కారం లభిస్తోందని పేర్కొన్నారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని రూ.1.80 కోట్ల అభివృద్ధి పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించాయని, త్వరలోనే వాటిని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. 39వ డివిజన్ను నగరానికి ఆదర్శవంతమైన (రోల్ మోడల్) డివిజన్‌గా తీర్చిదిద్దే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుందని, ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# మల్బరీ నర్సరీ ప్లాంటేషన్‌కు శ్రీకారం

మడకశిర (చైతన్యరథం): నియోజకవర్గం అమరాపురం మండలం అగ్రహారం గ్రామంలో మల్బరీ నర్సరీ ప్లాంటేషన్ కోసం అవసరమైన మల్బరీ పుల్లల కత్తిరింపు కార్యక్రమాన్ని ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన మల్బరీ నాట్లు అందుబాటులోకి తీసుకురావడం, పట్టు పరిశ్రమను ప్రోత్సహించడం, రైతుల ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మల్బరీ నర్సరీ ద్వారా స్థానిక రైతులకు అవసరమైన నాట్లు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, రైతులు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.



# అంగన్వాడీలకు తల్లికి వందనం చారిత్రాత్మకం

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వెల్లడి



కోవూరు (చైతన్యరథం): అంగన్వాడీ కేంద్రాలకు కూడా తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. సిలిండర్ల వినియోగంలో ఉన్న ఇబ్బందులను గుర్తించి అంగన్వాడీలకు ఇండక్షన్ స్టవ్‌లు, కుక్కర్లు కూడా అందిస్తున్నామని, ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయనంత మేలు కూటమి ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థకు చేస్తోందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా జల్ జీవన్ మిషన్ కింద విశాఖ హరిజనవాడలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు, వెటర్నరీ ఆసుపత్రి వద్ద కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను రూ.38.50 లక్షలతో నిర్మించినట్లు చెప్పారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా పోతురాజు స్వామి ఆలయం, భావన రుషి ఆలయ నిర్మాణాలకు రూ.47 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి కింద ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోటా నుంచి రూ.10 లక్షల ఎల్‌వోసీతో పాటు నాలుగు పేద కుటుంబాలకు మొత్తం రూ.12.61 లక్షల విలువైన ఆర్థిక సహాయ చెక్కులు అందజేసినట్లు వెల్లడించారు. మొత్తంగా నరసాపురం పంచాయతీలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం ఇప్పటివరకు రూ.1.35 కోట్లకు పైగా వ్యయం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలకు తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసినందుకు ఆనందం వ్యక్తం చేస్తూ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు నిర్వహించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. మైపాడు రహదారి నిర్మాణం ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే గారు తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి సహకారంతో రహదారి పూర్తికావడంతో ఇందుకూరుపేట మండల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తోందని ప్రశాంతి రెడ్డి గారు తెలిపారు. తల్లికి వందనం, ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ పెంపు, మత్స్యకారుల సేవలో, ఆటో సేవలో, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఆక్వా రైతులకు విద్యుత్ ఛార్జీలు తగ్గించామని, త్వరలో కొత్త పెన్షన్లను కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. యాగర్ల సెంటర్‌లో ఎన్నేళ్లుగానో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు శాశ్వత పరిష్కారంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సహకారంతో మూడు నెలల్లోనే బ్రిడ్జి పనులు ప్రారంభించగలిగామని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు వైద్య సహాయం అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ వీరేంద్ర రెడ్డి, నాయకులు కళ్యాణ్ రెడ్డి, సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తకు కష్టం వస్తే కలిసొచ్చేది టీడీపీనే

## మరోసారి నిరూపించిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్



పెనమలూరు (చైతన్యరథం): పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలను కష్టకాలంలో ఆదుకోవడం తెలుగుదేశం పార్టీ సంప్రదాయమని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మరోసారి చాటిచెప్పారు. పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ క్రియాశీల సభ్యురాలు స్వర్గీయ దకవరపు అగ్నేష్ అకాల మరణంతో, టీడీపీ కార్యకర్తల ప్రమాద బీమా పథకం కింద మంజూరైన రూ. 5 లక్షల భీమా చెక్కును ఆమె భర్త దకవరపు సంజీవరావుకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తలను పట్టించుకోని వారు నేడు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారని, కానీ తెలుగుదేశం పార్టీ మాత్రం కార్యకర్తల సంక్షేమాన్ని మాటల్లో కాదు, చేతల్లో నిరూపిస్తోందని అన్నారు, పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్త కుటుంబానికి అవసరమైన సమయంలో అండగా నిలవడం టీడీపీ బాధ్యతగా భావిస్తుందన్నారు. స్వర్గీయ దకవరపు అగ్నేష్ సేవలను స్మరించుకున్న ఎమ్మెల్యే, వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : శ్రీరామ్



ధర్మవరం (చైతన్యరథం): టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో ఆయన అర్జీలు స్వీకరించారు. ప్రతి ఒక్కరితో ఓపికగా మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో ప్రధానంగా విద్యుత్, రోడ్లు, డ్రైనేజీలు రెవెన్యూ పరమైన సమస్యలు శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. కొంతమంది పింఛన్లు, రేషన్ కార్డుల కోసం అర్జీలు ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీకి ఖచ్చితమైన పరిష్కారం చూపే విధంగా చొరవ తీసుకుంటామని శ్రీరామ్ అన్నారు. త్వరలోనే కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరవుతాయని ఆయన తెలిపారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని శ్రీరామ్ సూచించారు. స్థానిక నాయకులు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా చొరవ చూపాలని సూచించారు.

# బుద్ధి తెచ్చుకుని హుందాగా వ్యవహరించండి

## వైసీపీ మూర్ఖులకు టీడీపీ నాయకుల హితవు

తిరుపతి (చైతన్యరథం): నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ జేబీ శ్రీనివాస్ ఇతర ముఖ్య నాయకులు నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వైఎస్ఆర్సీపీ నేతల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, తిరుమల పవిత్రతను కాపాడడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో అవినీతిని, దళారీ వ్యవస్థను పెంచి పోషించి, తిరుపతి యువత భవిష్యత్తును నాశనం చేసిన వారు ఇప్పుడు ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని విమర్శించారు. తిరుపతిలో జరిగిన అభివృద్ధి శూన్యమని, కేవలం అవినీతి మాత్రమే జరిగిందని వారు ఆరోపిస్తూ, అనవసరపు రాజకీయ విమర్శలను మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల నుంచి తిరస్కరణకు గురైన వైఎస్ఆర్సీపీ నేతలు ఇకనైనా బుద్ధి తెచ్చుకుని హుందాగా వ్యవహరించాలని, లేనిపక్షంలో తిరుపతి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జ్ జేబీ శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణా రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు సీనియర్ నాయకులు బీజీ కృష్ణ యాదవ్ ం ముంద్రి కృష్ణ యాదవ్ , మునిశేఖర్, తాతయ్య గుంట ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# టీడీపీకి పెరుగుతున్న ఆదరణతో వైసీపీకి వరుస షాకులు

## సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



సర్వేపల్లి (చైతన్యరథం): నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నారు. పొదలకూరు మండలం బిరదవోలు పంచాయతీకి చెందిన 10 కుటుంబాలు, విరువూరు గ్రామానికి చెందిన 14 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి.టీడీపీలో చేరిన వారికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆత్మీయంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమ పథకాల పట్ల విశ్వాసంతో ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ వైపు వస్తున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం పని చేయాలనే ఆలోచన ఉన్న ప్రతి ఒక్కరికీ తెలుగుదేశం పార్టీ తలుపులు ఎల్లప్పుడూ తెరిచి ఉంటాయని చెప్పారు.విరువూరు గ్రామానికి చెందిన కొల్లి లీలామోహన్ రెడ్డి, కొల్లి సాయికృష్ణారెడ్డి, గొరవరపు శ్రీనివాసులు, బోడమల బ్రహ్మయ్య, కొప్పుల ప్రసాద్, యాకసిరి వెంకటేశ్వర్లు, ముత్యాల గణేష్, సత్యం, ఇండ్ల అంబులయ్య, యాకసిరి దయాకర్, కొప్పుల సురేష్, తాటిపర్తి పెద్ద వెంకయ్యతో పాటు బిరదవోలు పంచాయతీకి చెందిన చిడదల మస్తానయ్య, పెంచలయ్య, వెంకటరమణయ్య, వెంకటసుబ్బయ్య, పోలయ్య, ప్రసన్న, బదుగు వినోద్, కొత్తపల్లి రామస్వామి తదితరులు టీడీపీలో చేరారు.

# ముద్రగడ ఆశయ సాధనే నిజమైన నివాళి

## సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమ



విజయవాడ (చైతన్యరథం): గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురం సమీపంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో మాజీ మంత్రి, దివంగత శ్రీ ముద్రగడ పద్మనాభం గారి సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు గారు, కాపు సామాజిక వర్గ నాయకులు, ముద్రగడ పద్మనాభం గారి అభిమానులు, వంగవీటి మోహనరంగా గారి అభిమానులు, బొండా ఉమ అభిమానులు, వివిధ కాపు సంఘాల ప్రతినిధులు పాల్గొని ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ కాపు హక్కులు, రిజర్వేషన్లు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత నాయకుడు ముద్రగడ పద్మనాభం గారని కొనియాడారు. కాపు సమాజ హక్కుల సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన ఆయన పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని అన్నారు. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు చిరకాలం ప్రజల్లో సజీవంగా నిలిచిపోతాయన్నారు. కాపు సమాజం ఐక్యంగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. త్వరలో విజయవాడలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలకు చెందిన కాపు నాయకులు, కాపు సంఘాల ప్రతినిధులతో ఒక భారీ సమావేశాన్ని నిర్వహించి, సమాజ భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. 1988లో విజయవాడలో జరిగిన చారిత్రాత్మక కాపునాడు సభను గుర్తు చేస్తూ, ముద్రగడ పద్మనాభంకు విజయవాడతో ప్రత్యేక అనుబంధం ఉందని బొండా ఉమ అన్నారు. కాపు సమాజ ఐక్యత కోసం ఆయన చేసిన సేవలను భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం సేవలను చిరస్థాయిగా నిలుపుకునే ఉద్దేశంతో విజయవాడ నగర నడిబొడ్డున ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కాపు సమాజ హక్కుల సాధన కోసం ఆయన ఆశయాలను కొనసాగిస్తూ అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

జోన్-4

(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)

చైతన్యరథం



# త్వరలోనే కొత్త అక్రిడిటేషన్ విధానం

## మంత్రి నారాయణ వెల్లడి

నెల్లూరు (చైతన్యరథం): ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మీడియా ఫెడరేషన్-ఎ్రూవీఖీ జిల్లా మహాసభల్లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రికి ఫౌండర్ ఢిల్లీ బాబురెడ్డి, సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియా సమాజానికి దిశానిర్దేశం చేస్తుందన్నారు .జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.గతంలో ఉన్న అక్రిడిటేషన్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ వివక్ష లేకుండా కొత్త అక్రిడిటేషన్ విధానాన్ని తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. అలాగే జర్నలిస్టుల కుటుంబాలకు హెల్త్ స్కీమ్ కింద నిరంతరాయ నగదు రహిత వైద్యం, అర్హులైన వారికి ఇళ్లు లేదా ఇంటి స్థలాల కేటాయింపును ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వం-మీడియా కలిసి పనిచేస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమిషనర్ నందన్, జర్నలిస్ట్ యూనియన్ నేతలు నరసింహులు, ఐ మల్లికార్జున, వెంకట్ నారాయణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# కరుణాకర్ రెడ్డి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

## స్విమ్స్‌పై బురద జల్లుతున్న కర్కోటకుడు : టీడీపీ నేత సప్తగిరి ప్రసాద్



తిరుపతి (చైతన్యరథం): రాష్ట్రానికి తలమానికమైన తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ లో ఎప్పుడూ లేనివిధంగా దాదాపు 300 పైసలుకు నర్సింగ్, పారామెడికలు నాన్ పారా మెడికల్ పోస్టుల్ని పారదర్శకంగా భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ, స్విమ్స్ అధికారులు ఏర్పాటు చేస్తుంటే తిరుపతి మాజీ శాసనసభ్యుడు టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మళ్ళీ బురద చల్లి, బ్లాక్ మెయిలింగ్ చేయడానికి ప్రెస్ మీట్ లు పెడుతూ తన రాజకీయ ఉనికిని కోసం అల్లాడుతున్నారని టీడీపీ నేత సప్తగిరి ప్రసాద్ ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన మీటితాతో మాట్లాడారు. స్విమ్స్ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా 303 పోస్టులు, అందులో 212 నర్సింగ్ పోస్టుల్ని భర్తీ చేయడానికి, పేద రోగులకి నాణ్యమైన వైద్య సేవ అందించడానికి టీటీడీ ఆధ్వర్యంలో ఇంత పెద్ద ఎత్తున నోటిఫికేషన్ విడుదల చేస్తే, కడుపు మండి, చేస్తున్న అభివృద్ధిని ఓర్చుకోలేక ఈరోజు నిందలు వేస్తున్నాడన్నారు. స్విమ్స్ చరిత్రలోనే 30 ఏళ్ల తర్వాత బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటుంటే అభినందించాల్సింది పోయి... అక్కసు వెళ్ళకకుతున్నాడని ఎద్దేవా చేశారు. ఎప్పుడూ లేనివిధంగా రాత పరీక్ష ద్వారా ఉద్యోగాలన్నిటినీ భర్తీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రశ్నాపత్రాలన్నీ కూడా ఎయిమ్స్, ఐఐటి మరియు ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ సైన్స్ బాధితులు అప్పజెప్పడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇంకా ప్రశ్నాపత్రాలు తయారు కాక మునుపే, ప్రశ్న పత్రాలు తయారు అయిపోయాయి, అని ఇందులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని పోస్ట్ లు అమ్ముకున్నారనేసి తన అక్రోసాన్ని, వాంతులు కక్కుతున్నాడు. నోటిఫికేషన్ టైం ఇంకా కానేలేదు పూర్తికానే లేదు, దరఖాస్తులు ఇంకా చేరనే లేదు అప్పుడే పోస్టు అమ్ముకున్నారని వాంతులు చేసుకుంటున్నాడు. ఎన్ని అక్రోసాలు చేసినా, ఎన్ని ఆరోపానాలు చేసినా ప్రతి పోస్ట్ ని పారదర్శకంగా చేస్తామని... కరుణాకర్ రెడ్డి ఎంత వాంతులు చేసుకున్నప్పటికీ తిరుపతి ప్రజలు నమ్మరని... దాదాపుగా కరుణాకర్ రెడ్డి రాజకీయ జీవితం అంతమైపోయిందన్నారు. తిరుపతి ప్రజలు ఇంకా ఆయన మరిచిపోయారన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. బ్లాక్మెయిలింగ్ చేస్తే ఒకటి రెండు పోస్టు ఇవ్వకపోతారా ?అని ఆశతో భూమన కరుణాకర్ రెడ్డి ఇటువంటి అర్థం!పర్థం లేని ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. సిమ్స్‌లో ఎప్పుడూ లేనివిధంగా వ్రాత పరీక్ష ద్వారా ఇంత పెద్ద ఎత్తున ఉద్యోగాలు భర్తీ చేసిన చరిత్ర లేదని విషయాన్ని తెలుసుకోవాలి .అదే విధంగా స్విమ్స్ లో పనిచేస్తున్నటువంటి ఇన్ సర్వీస్ కాండేట్ లు కూడా అదనపుగా వాళ్ల సేవలను గుర్తించి ఆదనంగా 15 మార్కులు, అదే విధంగా వయస్సు సడలింపు కూడా ఇస్తున్నామనే విషయాన్ని కరుణాకర్ రెడ్డి గుర్తించుకోవాలి. ఇటువంటి అక్రోషపు వాంతులు చేసుకునేటువంటి విషయాన్ని మానుకోవాలని తెలుగుదేశం పార్టీ పక్షాన హెచ్చరించారు. సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి శేషాద్రి నాయుడు, నాయకులు శంకర్, నాయక్, వెంకటేష్ గంగాధర్, భరత్ కుమార్లు పాల్గొన్నారు.



కొవ్వూరు టీడీపీ కార్యాలయంలో ఇద్దరు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు ఎల్వోసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

# యనమల రామకృష్ణుడికి ఘన స్వాగతం

తిరుపతి (చైతన్యరథం): టీడీపీ సీనియర్ నాయకుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు తిరుపతి చేరుకున్న సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి. నరసింహ యాదవ్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెల్లూరు డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శి అన్నా అనిత, తిరుపతి పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జిలు దంపూరు భాస్కర్ యాదవ్, కృష్ణ యాదవ్, మస్తాన్ యాదవ్, సూళ్లూరుపేట పార్టీ నాయకులు వెంకటేశ్ యాదవ్, రామారావు తదితరులు పాల్గొని యనమల రామకృష్ణుడికి పుష్పగుచ్ఛాలు అందించి ఆత్మీయ స్వాగతం పలికారు.





# సంక్షేమాభివృద్ధికి సమప్రాధాన్యం

## కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడి

కోవూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నరసాపురం పంచాయతీలో రూ.58 లక్షల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆమె ప్రారంభోత్సవం చేశారు. అనంతరం గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే తన లక్ష్యమని, కనీసం 50 శాతం హామీలు నెరవేర్చిన తర్వాతే ఆయా గ్రామాల్లో పర్యటిస్తానని ముందుగానే స్థానిక నాయకులకు చెప్పినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక ప్రాంతాల్లో ఆ లక్ష్యాన్ని చేరుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైపాడు కాలువ, మైపాడు బ్రాంచి కాలువపై రూ.14.50 లక్షలతో నరసాపురం గ్రామ సమీపంలో నిర్మించిన రెండు కల్వర్టులను ప్రారంభించారు. వీటి నిర్మాణంతో దాదాపు 30 ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపామని అన్నారు. అలానే రూ.8.10 లక్షలతో నరసాపురం గ్రామ పంచాయతీలో నిర్మించిన అంతర్గత సిమెంటు రోడ్లను, రూ.35.50 లక్షలతో విశాఖ హరిజనవాడలో జల్ జీవన్ మిషన్ కింద ఏర్పాటు చేసిన ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లను ఎమ్మెల్యే ప్రజలకు అంకితం చేశారు. నరసాపురం గ్రామ ప్రజలు ఎంతోకాలంగా తన రాక కోసం ఎదురుచూశారని, వారు చూపించిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మైపాడు కాలువ, మైపాడు బ్రాంచి కాలువపై నిర్మించిన కల్వర్టులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో గ్రామ ప్రజలు కోరిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, గృహాలు తదితర పనులను కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే నరసాపురంలో రెండు కిలోమీటర్ల డ్రెయిన్ల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేశామని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

### నరసాపురంలో రూ.1.35 కోట్ల అభివృద్ధి

నరసాపురం పంచాయతీలో గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా ఎమ్మెల్యే వివరించారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నరసాపురం పంట కాలువపై కల్వర్టు మరమ్మతులకు రూ.3 లక్షలు, మైపాడు కాలువ సమీపంలోని కల్వర్టు మరమ్మతులకు రూ.11.50 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా మూడు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.8.10 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఐదు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు 28 దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల మార్పిడి, రెండు కిలోమీటర్ల మేర కండక్టర్ల మార్పిడి, ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద 20 కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, 1.5 కిలోమీటర్ల మేర కండక్టర్ల ఏర్పాటు, లైన్ కన్వర్షన్ పనులను రూ.16.92 లక్షల వ్యయంతో పూర్తి చేసినట్లు తెలిపారు.



# టీడీపీ బలోపేతానికి సమష్టి కృషి

## శ్రేణులకు మంత్రి సవిత పిలుపు, టీడీపీలో చేరిన 35 వైసీపీ కుటుంబాలు

పెనుకొండ (చైతన్యరథం): పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన 35 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, అలాగే పెనుకొండ నియోజకవర్గంలో మంత్రి సవిత నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. పెనుకొండ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సవితమ్మ సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పారదర్శక పాలన, అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ఆ అభివృద్ధిని చూసి అన్ని వర్గాల ప్రజలు, వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని, పార్టీ బలోపేతానికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# అమరాపురంలో కెంపేగౌడ విగ్రహం

## స్థలాన్ని పరిశీలించిన ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

అమరాపురం (చైతన్యరథం): మండల కేంద్రంలో నాడప్రభు కెంపేగౌడ విగ్రహం ఏర్పాటు కోసం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాడప్రభు కేంపేగౌడ సేవలను చిరస్థాయిగా గుర్తుంచుకునేలా అమరాపురం మండల కేంద్రంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందదాయకమని తెలిపారు. విగ్రహ ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలను వేగవంతంగా పూర్తి చేసి, త్వరలోనే ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కురుబ సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఆఖరి ఓటు వరకూ అప్రమత్తంగా ఉండాలి

## పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు



రాప్తాడు (చైతన్యరథం): సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్)కు మరో 5రోజులు మాత్రమే గడువు ఉందని.. ఇంకా ఎన్యుమరేషన్ ఫామ్ లు బిఎల్ఓ లకు అందజేయకపోతే.. పార్టీ శ్రేణులు చొరవ తీసుకోవాలని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఎస్ఐఆర్ పై సమీక్ష చేశారు. పార్టీ శ్రేణులతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫామ్ లు ఎవరెవరు అందజేయలేదన్నది బిఎల్ఏలు ఇంటింటా పెళ్లి మరోసారి పరిశీలించాలన్నారు. మ్యాపింగ్ కాని ఓట్లు, చనిపోయిన ఓట్లు, డబల్ ఓట్లు, డూప్లికేట్ మరియు షిఫ్టింగ్ ఓట్ల వివరాలు పోలింగ్ బూత్ ల వారిగా బిఎల్ఏ లకు అందజేశామన్నారు. వాటిని పరిశీలించి ఇంకా మిగిలి ఉన్న వారితో ఎన్యూమరేషన్ ఫామ్ లు ఇప్పించేలా చూడాలని ఆదేశించారు. అదే విధంగా 17 సంవత్సరాలు పూర్తి చేసుకొని.. 18సంవత్సరాల వయసు ఉన్న వారిని కొత్త ఓటర్లుగా చేర్చే బాధ్యత తీసుకోవాలన్నారు. బిఎల్ఏ లు ఈ 5రోజులపాటు అప్రమత్తంగా ఉంటూ మరోసారి డోర్ టు డోర్ వెళ్లాలని సూచించారు. క్లస్టర్, యూనిట్, మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులు దీనిని పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు.

# మంత్రి లోకేశ్ చొరవతోనే విద్యాశాఖలో సమూల మార్పులు

## హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం (చైతన్యరథం): ఆర్.అండ్.బి అతిథి గృహం వద్ద ఉన్న ఎస్సీ హాస్టల్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సందర్శించారు. ఎస్సీ హాస్టల్ విద్యార్థులతో మమేకమవుతూ సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన సామాగ్రిని అందజేశారు. యూనిఫామ్, ట్రంకు పెట్టెలు, నైట్ డ్రెస్, భోజనం ప్లేట్లు, షూ ఇతర సామాగ్రి అందజేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జగన్ రెడ్డి పాలనలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. కానీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఈరోజు ప్రభుత్వ బడిలో చేరేందుకు పోటీ ఉందన్నారు. పబ్లిసిటీ పిచ్చితో పుస్తకాలు, చివరకు బెల్టులపై కూడా తన ఫోటోలు వేయించుకున్నాడన్నారు. అతను జగన్ మామయ్య కాదు.. తుగ్లక్ మామయ్య అని ఎమ్మెల్యే దగ్గుపాటి ఎద్దేవా చేశారు. ఈ మాట ప్రతి ఒక్క విద్యార్థి ఇప్పుడు చెబుతున్నారన్నారు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రి అయ్యాక సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో విద్యా కానుకలు అందిస్తున్నారని గుర్తు చేశారు. గత ఏడాది 63లక్షల మందికి 10 వేల కోట్ల వరకు తల్లికి వందనం కింద అందించారన్నారు. ఈ ఏడాది మరో లక్ష మందికి అదనంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాంన్నారు. అనంతపురం నగరంలో 6 పాఠశాలలను అప్ గ్రేడ్ చేశామని, దీనివలన 90 మంది ఉపాధ్యాయులు అదనంగా వచ్చారని వివరించారు. విద్యాశాఖలో సమూల మార్పులు తెచ్చిన నాయకుడు మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలల్లో మరిన్ని మార్పులు రానున్న రోజుల్లో చూస్తారని .ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వెల్లడించారు.

# పాఠశాలల పరిశుభ్రత కూడా ముఖ్యం

ధర్మవరం (చైతన్యరథం): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు పాఠశాలల పరిశుభ్రత కూడా ముఖ్యమని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యం కూడా అదేనని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ధర్మవరం పట్టణంలోని రైల్వే బాలుర పాఠశాలలో పచ్చదనం పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు శ్రీరామ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారితో కలిసి అక్కడ మొక్కలు నాటారు. పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి విద్యార్థి బాధ్యత అన్నారు. ఇక్కడ తడి, పొడి చెత్తను వేరువేరుగా చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. దానిని పాఠశాల ఆవరణంలో ఎక్కడ పడితే అక్కడ వేయడం వల్ల అపరిశుభ్ర వాతావరణం ఉండటమే కాకుండా పిల్లల ఆరోగ్యం పై కూడా ప్రభావం చూపుతాయని అన్నారు. మిగిలిపోయిన ఆహారాన్ని కూడా డ్రైనేజీలో వేయకుండా ప్రత్యేకంగా ఉంచాలన్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ఒక ఆహ్లాదకరమైన వాతావరణ ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు విద్యార్థులకు అవగాహన కల్పించాలని శ్రీరామ్ సూచించారు.



# భక్తి పారవశ్యంలో మిస్సోరి



◆ నాలుగోరోజుకు శతచండీ సహిత రుద్ర యాగం

◆ వైభవంగా సామూహిక సహస్ర కుంకుమార్చన

◆ ఆధ్యాత్మికతతో వెల్లివిరిసిన హిందూ దేవాలయం


◆ భారీగా పాల్గొన్న ప్రవాస భక్తులు

**అమెరికా:** మిస్సోరి రాష్ట్రం సెయింట్ లూయిస్ హిందూ దేవాలయంలో జరుగుతున్న నవకుండాత్మక శతచండీ సహిత రుద్రయాగం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయం ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది. వేద మంత్రాలు, హోమగుండాలతో యాగశాల పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నాలుగో రోజు గోమాత పూజతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం మహాన్యాస పారాయణం, రుద్రహోమం, సుదర్శన హోమం, చండీ పారాయణం చండీ హోమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ముఖ్యంగా అత్యంత శక్తివంతమైన 'ప్రత్యం గిరా హోమం' నిర్వహించడం విశేషం. సామూహిక సహస్ర కుంకుమార్చన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఉత్తర అమెరికాలో ఇంత భారీస్థాయిలో సామూహికంగా నిర్వహించిన తొలి కుంకుమార్చన ఇదే కావడం గమనార్హం. మహిళలు ఎరుపు రంగు వస్త్రధారణలతో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అందజేసిన ప్రత్యేక పూజా సామగ్రితో అమ్మవారిని ఆరాధించారు. పూజా ప్రాంగణంలో శ్రీచక్రాన్ని అద్భుతంగా అలంకరించారు. అమ్మవారిని నవదుర్గాదేవిగా పూజించారు. ఈ సందర్భంగా భక్తులకు పవిత్రమైన రుద్రాక్షలను ప్రసాదంగా అందజేశారు.

### భక్తుల కోసం అన్నప్రసాద వితరణ నిర్వహణ

ఈ మహాయజ్ఞంలో పాల్గొన్న దాదాపు 4,000 మంది భక్తుల కోసం ఫుడ్ కమిటీ అధ్యక్షురాలు పల్లవి సూరపనేని, కమిటీ సభ్యులు రాజేష్ ఏవూరి, సతీష్ లంకల నేతృ త్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆదివారంతో ముగిసిన ఈ మహాయజ్ఞంలో ప్రవాస భక్తులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగవరపు రజనీకాంత్, ఉపాధ్యక్షుడు సాక్షి విజయ్, కార్యదర్శి జంగా కిషోర్, కోశాధికారి పుట్టగుంట మురళీ, స్టీరింగ్ కమిటీ సభ్యుడు బైరపునేని సురేంద్రనాథ్ మీడియా సమన్వయ కర్త రాజా సూరపనేని తదితరులు పాల్గొన్నారు.











# అఖిలపక్ష సమావేశంలో హైడ్రామా

**- ప్రతిపక్షాల వాకౌట్**

**- నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో హైడ్రామా చోటుచేసుకుంది. ఈ సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) తిరుగుబాటు ఎంపీలకు ఆహ్వానం ఇవ్వడాన్ని ఆ పార్టీ నిరసించింది. దీంతో ఇండియా కూటమి పార్టీల నేతలు వాకౌట్ చేశారు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ సమావేశానికి హాజరయ్యాయి.

అఖిలపక్ష సమావేశానికి టీఎంసీ తిరుగుబాటు ఎంపీలను ఆహ్వానించడాన్ని విపక్షాలు తీవ్రంగా తప్పుపట్టాయి. లోక్‌సభలో వారికి ప్రత్యేకంగా సీటింగ్ ఏర్పాటు చేయడం, స్పీకర్ వద్ద అనర్హత పిటిషన్లు ఇంకా పెండింగ్‌లో ఉండగానే వారికి గుర్తింపు కల్పించేలా వ్యవహరించడంపై మండిపడ్డాయి. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించాయి. ఈ సందర్భంగా శివసేన(యూబీటీ) తిరుగుబాటు ఎంపీల విలీన అంశాన్నీ విపక్షాల నేతలు ప్రస్తావించారు.

వాకౌట్ అనంతరం కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ మాట్లాడుతూ.. స్పీకర్ తీసుకున్న నిర్ణయాలకు నిరసనగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకగ్రీవంగా వాకౌట్ చేశాయని తెలిపారు. సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ కూడా టీఎంసీ తిరుగుబాటు ఎంపీలకు ఆహ్వానం ఇవ్వడాన్ని తప్పుపట్టారు. ఇది ప్రజాస్వామ్యానికి జరిగిన అన్యాయంగా అభివర్ణించారు.

టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా మాట్లాడుతూ.. అధికారికంగా



గుర్తింపు లేని ఎన్‌సీపీఐ పేరుతో ఉన్న తిరుగుబాటు ఎంపీలను ఏ ప్రాతిపదికన సమావేశానికి పిలిచారని ప్రశ్నించారు. వారిపై ఉన్న అనర్హత పిటిషన్లు ఇంకా స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, రాజ్యాంగ సవరణల ప్రకారం ప్రత్యేక బ్లాక్‌కు అవకాశం లేదని పేర్కొన్నారు. ఈ చర్యకు నిరసనగానే ప్రతిపక్షాలన్నీ వాకౌట్ చేశాయని చెప్పారు.

మరో వైపు పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కేంద్రం కోరింది. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా, అర్జున్ రామ్ మేఘవాల్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి లావు శ్రీకృష్ణదేవరాయలు (తెదేపా), బాలశౌరి (జనసేన), మిథున్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి(వైకాపా), వద్దిరాజు రవిచంద్ర (బీఆర్ఎస్) పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశంలో విపక్షాలు పలు కీలక అంశాలను ప్రస్తావించాయి. అయోధ్య రామాలయ విరాళాల వ్యవహారం, నీట్ పేపర్ లీక్, వ్యవసాయ సమస్యలు, పెట్రోల్లో ఈ 20 ఇంధన మిశ్రమం, అలాగే నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) వంటి అంశాలపై పార్లమెంట్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశాయి. దీంతో, వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాకముందే అఖిలపక్ష సమావేశంలో రాజకీయ వేడి రాజుకుంది. ఎన్సీపీఐకి ఇచ్చిన గుర్తింపుపై మొదలైన వివాదం.. పార్లమెంట్ సమావేశాల్లోనూ అధికార విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదానికి దారితీసే సూచనలు కనిపిస్తున్నాయి. పేపర్ లీకేజీలు, నిరుద్యోగం, ఇతర ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు జరగనున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి.

**అవి తప్పుడు వార్తలు: జైరాం రమేశ్**

అఖిలపక్ష సమావేశంలో ప్రతిపాదిత నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు మద్దతు లభించిందంటూ వచ్చిన వార్తలను కాంగ్రెస్ సీనియర్ నేత, పార్టీ కమ్యూనికేషన్ల ఇన్‌ఛార్జ్, జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ తీవ్రంగా ఖండించారు. అవన్నీ 'పూర్తిగా అబద్ధం, ఫేక్ న్యూస్' అని ఆయన కొట్టిపారేశారు.

అఖిలపక్ష సమావేశంలో డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు లభించినట్లు కొన్ని టీవీ ఛానెళ్లు ప్రసారం చేస్తున్న వార్తలు కావాలని సృష్టించినవని జైరాం రమేశ్ ఆరోపించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ... 'కొన్ని టీవీ ఛానెళ్లు డీలిమిటేషన్ బిల్లుకు అఖిలపక్ష సమావేశంలో మద్దతు లభించిందంటూ వార్తలను ఫ్లాష్ చేస్తున్నాయి. ఇది పూర్తిగా ఫేక్ న్యూస్' అని ఆయన స్పష్టం చేశారు.

# జమ్మూకశ్మీర్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు

**- 11 మంది మృతి, పలువురు గల్లంతు**

జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాలైన రాజౌరి, పూంచ్ జిల్లాలను ఆకస్మిక వరదలు అతలాకుతలం చేశాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ వరదల ధాటికి కనీసం 11 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు గల్లంతయ్యారని అధికారులు వెల్లడించారు. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

రాజౌరి జిల్లాలో దార్హాలి, ఖాండ్లీ, సుక్తోహ్, జమోలా నదులు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో జనావాసాల్లోకి నీరు చేరింది. దీంతో పలుచోట్ల నివాస భవనాలు దెబ్బతినగా, మరికొన్ని చోట్ల రహదారులు తెగిపోయి, వాహనాలు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఫలితంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన అధికారులు.. సహాయక చర్యలను ముమ్మరం చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు



తరలిస్తున్నారు.

ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో మరో నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు.. నదులు, వాగుల సమీపానికి వెళ్లొద్దని అధికారులు సూచించారు. కాగా.. ప్రభుత్వం పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే సహాయక చర్యలను వేగవంతం చేసింది.

పూంచ్ జిల్లాలో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. సహాయక బృందాలు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాయి.

వరదల వల్ల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు భారీ నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. జులై 23 వరకు జమ్మూకశ్మీర్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.

## పార్లమెంట్ మార్చ్ విజయవంతం చేయండి: వాంగ్‌చుక్

**- ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందన్న ఆసుపత్రి వర్గాలు**



*ఢిల్లీలో సోమవారం తలపెట్టిన 'పార్లమెంట్ మార్చ్' (పార్లమెంట్ వరకు నిరసన ర్యాలీ)ను విజయవంతం చేయాలని పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ తన మద్దతుదారులకు పిలుపునిచ్చారు. తనను ఆస్పత్రిలో అక్రమంగా నిర్బంధించారని ఆయన ఆక్షేపించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వాంగ్‌చుక్ 21 రోజులుగా చేపట్టిన నిరాహార దీక్షను శనివారం భగ్నం చేసిన పోలీసులు.. ఆయన్ని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేర్పిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెల్లకాగితంపై వాంగుచక్ రాసిన సందేశాన్ని భార్య గీతాంజలి ఆయన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు.*

*కాక్రోచ్ జనతా పార్టీ సోమవారం (జులై 20) చేపట్టదలచిన నిరసన ర్యాలీలో పాల్గొనాలని మద్దతుదారులను వాంగ్‌చుక్ కోరారు. నిర్భయమైన భారత్ సాకారం కావాలని పిలుపునిచ్చారు. తన నిరాహార దీక్షగానీ, కాక్రోచ్ జనతాపార్టీ చేపట్టనున్న 'పార్లమెంట్ మార్చ్'గానీ అన్యాయం నుంచి విముక్తి కోసమేనని ఆయన పునరుద్ఘాటించారు. మరోవైపు 'పార్లమెంట్ మార్చ్'కు పోలీసులు అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా అనుమతి నిరాకరించినట్లు సమాచారం.*

*నిలకడగా ఆరోగ్యం*

*వాంగుచక్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. నిపుణులైన వైద్యుల బృందం ఆయన్ని నిశితంగా పరిశీలిస్తోందని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి యాజమాన్యం బులెటిన్ విడుదల చేసింది. దీర్ఘకాలం పాటు ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తంలో చిన్నపాటి సమస్యలు తలెత్తాయని పేర్కొంది. మరోవైపు ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు.. అత్యవసర వైద్య సేవలు అందించేందుకే వాంగ్‌చుక్‌ను జంతర్‌మంతర్‌లోని దీక్షా స్థలి నుంచి ఆస్పత్రికి తరలించినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.*



## ఫిఫా ఫైనల్.. విద్యాసంస్థలకు సెలవు

ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సందర్భంగా కేరళ, మణిపూర్ ప్రభుత్వాలు సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాయి. ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము 3.30 వరకు అర్జెంటీనా–స్పెయిన్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మ్యాచ్‌ను చూసేందుకు అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరగా.. వారి విజ్ఞప్తిని ఆ ప్రభుత్వాలు అంగీకరించాయి. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశాయి. నిరంతర విద్యుత్తు సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపాయి.

### నాగాలాండ్‌లో వర్ష బీభత్సం

## కొండచరియలు విరిగిపడి 8 మంది మృతి



నాగాలాండ్‌ను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. వీటి కారణంగా మోన్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు. మరో 12 మందికి గాయాలయ్యాయి. పది నుంచి పదిహేను ఇళ్లు దెబ్బతినగా.. శిథిలాల కింద మరింత మంది ఉండవచ్చని భావిస్తున్నారు. నాగాలాండ్ పోలీసులు సహా అస్సాం రైఫిల్స్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసే ప్రయత్నం చేస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి మోన్ జిల్లా కేంద్రం వణికిపోయింది. అనేక ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇళ్లు, రోడ్లు, మౌలికసదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. కొండచరియలు విరిగిపడిన ఘటనలో పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్లు తెలుస్తోంది.

# ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు

ఇరాన్‌పై అమెరికా ఆదివారం తెల్లవారుజామున మరోసారి భీకర వైమానిక దాడులు నిర్వహించింది. జోర్డాన్‌పై ఇరాన్ చేసిన దాడిలో ఇద్దరు అమెరికా సైనికులు మరణించడంతో వీటిని చేపట్టినట్లు అమెరికా వెల్లడించింది. ఇది వరుసగా ఎనిమిదో రాత్రి నిర్వహించిన దాడి అని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. జోర్డాన్‌లోని అమెరికా సైనికులపై దాడి చేసిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) బలగాలను దెబ్బతీయడమే ఈ ఆపరేషన్ లక్ష్యమని పేర్కొంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశానుసారమే వీటిని జరిపినట్లు వెల్లడించింది. హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు ముప్పు కలిగించే ఇరాన్ సామర్థ్యాన్ని మరింత బలహీనపర్చడమే ఈ దాడుల ఉద్దేశమని పేర్కొంది. ఈ సందర్భంగా అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మాట్లాడుతూ.. ఇద్దరు అమెరికా సైనికుల మరణం తమ సంకల్పాన్ని మరింత బలపరిచిందని, దీనికి తగిన ప్రతిస్పందన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, ఇరాన్‌కు చెందిన మెహర్ న్యూస్ ఏజెన్సీ ప్రకారం, దక్షిణ ఇరాన్లోని సిరిక్ పోర్టు నగరంతో పాటు హాజీబాద్ సమీప ప్రాంతాలపై అమెరికా దాడులు జరిపింది. అయితే ప్రాణనష్టం జరిగినట్లు ఇప్పటివరకు సమాచారం లేదు.



అమెరికా సైనిక స్థావరాలపై ..


అమెరికా దాడులకు ప్రతీకారంగా కువైట్‌లోని రెండు సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడులు నిర్వహించినట్లు ఇరాన్ ప్రకటించింది. కువైట్లోని క్యాంప్ ఉద్దెరిలో ఉన్న మందుగుండు సామగ్రి నిల్వ కేంద్రంపై, అలీ అల్ సలేం ఎయిర్ బేస్‌లోని పేట్రియట్ రాడార్ వ్యవస్థ, వైమానిక నిఘా రాడార్‌ను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. అమెరికా జరిపిన దాడులకు ప్రతిస్పందనగానే ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు ఇరాన్ సైన్యం వెల్లడించింది.

ఇక గల్ఫ్ దేశాలు పరిస్థితిని అత్యంత నిశితంగా గమనిస్తున్నాయి. హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరగడంతో ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అన్ని పక్షాలు వెంటనే కాల్పులు నిలిపి, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని యుఏఈ మరోసారి పిలుపునిచ్చింది.

జోర్డాన్‌పై శుక్రవారం ఇరాన్ జరిపిన మిసైల్ దాడుల్లో ఇద్దరు అమెరికా సైనికులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇరాన్ మిసైల్స్‌ను అడ్డుకునే ప్రయత్నంలో వారు కన్నుమూసినట్టు అమెరికా పేర్కొంది. ఈ ఘటనకు సంబంధించి మరో సైనికుడి జాడ ఇంకా తెలియాల్సి ఉందని పేర్కొంది. ఇక ఈ ఘటనలో గాయపడ్డ వారిని ఆసుపత్రిలో చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసినట్టు పేర్కొంది. ఫిబ్రవరి 28న మొదలైన యుద్ధంలో ఇప్పటివరకూ 16 మంది మిలిటరీ సిబ్బంది మరణించారని కూడా యూఎస్ ధ్రువీకరించింది.

## అమెరికాకు మరిచిపోలేని పాఠం

**- ఇరాన్ సుప్రీం లీడర్ మొత్తాబా ఖమేనీ**



దాడులు ఆపకుంటే అమెరికాకు మరిచిపోలేని పాఠం చెబుతామని ఇరాన్ సుప్రీం లీడర్ మొత్తాబా ఖమేనీ తీవ్రంగా హెచ్చరించారు. శాంతి ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సంతకం విలువ లేనిదని, నిష్ప్రయోజనమని స్పష్టం చేశారు. అమెరికా కొనసాగిస్తున్న దాడులకు నిరసనగా ఆ దేశంతో చేసుకున్న ఒప్పందంలోని హామీల అమలును నిలిపి వేస్తున్నామని ఇరాన్ ప్రకటించిన అనంతరం ఆయన ఒక సందేశాన్ని విడుదల చేశారు. దానిని ఇరాన్ అధికార టీవీలో చదివి వినిపించారు. "అమెరికా మరోసారి తన నిజ స్వరూపాన్ని బయట పెట్టుకుంది. ఆ దేశ విశ్వాస ఘాతుకానికి ఇది నిదర్శనం. అమెరికా ఇలాగే దాడులను కొనసాగిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఇరాన్, దాని సైనిక శక్తులవద్ద మరిచిపోలేని పాఠాలున్నాయి. వాటిని అమెరికాకు నేర్పిస్తాం' అని ఖమేనీ హెచ్చరించారు. కాగా యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఖమేనీ బాహ్య ప్రపంచానికి కనిపించలేదు.

**పూర్తిస్థాయి యుద్ధానికి అమెరికా సన్నద్ధం!**

అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న సైనిక ఘర్షణ పూర్తిస్థాయి యుద్ధంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. రెండుదేశాలు సుదీర్ఘకాలం పోరాటం చేసేందుకు అవసరమైన మిలిటరీ మౌలిక వసతులను వేగంగా సమకూర్చుకుంటున్నాయి. పూర్తిస్థాయి యుద్ధానికి సంబంధించిన ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రుబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ సమర్పించినట్లు ఒక వార్తా సంస్థ తెలిపింది. ఆ ప్రణాళికకు ట్రంప్ అనుమతి ఇవ్వగానే ఇరాన్‌పై విరుచుకుపడేందుకు ఆ దేశ మిలిటరీ సిద్ధమవుతోంది. అందులో భాగంగా ఇజ్రాయెల్‌లోని బెన్ గురియన్, రమన్ విమానాశ్రయాల్లో మరిన్ని అమెరికా ఆయిల్ రీఫ్యూయలింగ్ విమానాలను మోహరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ రెండు విమానాశ్రయాల్లో దాదాపు 30 చొప్పున ఇలాంటి విమానాలున్నట్లు తెలిసింది. మరోవైపు కువైట్, సౌదీ, జోర్డాన్, బహ్రెయిన్ , ఖతార్, ఇరాక్‌లోని తన మిలిటరీ స్థావరాలకు మరిన్ని శక్తిమంతమైన క్షిపణులు, డ్రోన్లు, యుద్ధ విమానాలను తరలిస్తోంది.

పరోవైపు అమెరికా పూర్తిస్థాయి యుద్ధానికి దిగితే ఎదుర్కొనేందుకు ఇరాన్ కూడా తన సర్వశక్తులూ కూడదీసుకుంటోంది. ముఖ్యంగా తన పొరుగున ఉన్న అమెరికా మిత్రదేశాలపైనే ఇరాన్ గురిపెట్టింది. కువైట్, ఖతార్, జోర్డాన్, బహ్రెయిన్, సౌదీ అరేబియాల్లోని అమెరికా స్థావరాలపైకి క్షిపణులు, డ్రోన్లను భారీగా ఎక్కుపెట్టింది. భూతల దాడులకు కూడా సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అమెరికాతో ఇక ఎలాంటి చర్చలు ఉండబోవని ప్రకటించింది.

## బలూచ్ ఆర్మీ కాల్పులు

***- 45 మంది పాక్ సైనికులు హతం***



బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) మరోసారి పాకిస్థాన్ సైన్యం లక్ష్యంగా దాడులు చేసింది. సెలవుపై ఉన్న సైనికులను పది బస్సుల్లో తీసుకెళ్తుండగా బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని మస్తుంగ్ జిల్లాలో వాటిపై గురిపెట్టి కాల్పులు జరిపింది. ఈ ఘటనలో 45 మందికిపైగా పాక్ సైనికులు ప్రాణాలు కోల్పోగా, పెద్దసంఖ్యలోనే గాయపడ్డారు. గత గురువారం జరిగిన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇది తమ ఫతా స్క్వాడ్ పనేనని బీఎల్‌ఏ అధికార ప్రతినిధి జీయాంద్ బలూచ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహన శ్రేణితో పాటు, అనంతరం వారిని ఆదుకోవడానికి వచ్చిన సిబ్బందిపైనా దాడులు చేసినట్టు అంగీకరించారు. గాయపడ్డ సైనికులను తీసుకెళ్లడానికి వచ్చిన అంబులెన్స్‌లపైనా దాడులు చేశారు. పాక్ సైన్యం మాత్రం మృతి చెందిన సైనికుల సంఖ్యను ఇంకా ధ్రువీకరించలేదు. ఈ దాడి అనంతరం పాక్ ప్రభుత్వం అప్రమత్తమయింది. హెలికాప్టర్లలో అదనపు సైనికులను, ఆయుధాలను పంపించింది. వైద్య సహాయం అందించే నిమిత్తం క్వెట్టా సహా ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించింది.

## ఇజ్రాయెల్‌లో జైళ్ల చుట్టూ మొసళ్లు..!

**- ఖైదీలు తప్పించుకోకుండా సంచలన నిర్ణయం**



జైళ్ల నుంచి ఖైదీలు తప్పించుకోకుండా అడ్డుకోవడానికి ఇజ్రాయెల్ ప్రభుత్వం అత్యంత విచిత్రమైన, సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. జైళ్ల చుట్టూ భద్రత కోసం ఇకపై మొసళ్లను ఉపయోగించేందుకు వీలు కల్పిస్తూ కొత్త నిబంధనను తీసుకువచ్చింది. ఇందులో భాగంగా మొసళ్లను 'వన్యప్రాణుల' జాబితా నుంచి తొలగించి, 'బంధించి పెంచే వన్యప్రాణుల' కేటగిరీలోకి మారుస్తూ ఇజ్రాయెల్ పర్యావరణ పరిరక్షణ మంత్రి ఇడిత్ సిల్మాన్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ చట్టపరమైన మార్పుతో వన్యప్రాణుల సంరక్షణ సంస్థల పరిధిలో ఉండే మొసళ్ల పర్యవేక్షణ బాధ్యతలు, ఇప్పుడు నేరుగా ప్రభుత్వ భద్రతా విభాగాల చేతుల్లోకి వెళ్లనున్నాయి.

ఇజ్రాయెల్‌కు చెందిన వివాదాస్పద తీవ్ర రైట్ వింగ్ భావజాల, జాతీయ భద్రతా మంత్రి ఇటమార్ బెన్‌గ్విర్ గత ఏడాది డిసెంబర్‌లోనే ఈ ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న 'అలిగేటర్ అల్కాట్రాజ్' తరహాలో పాలస్తీనా ఖైదీలు ఉన్న జైళ్ల చుట్టూ కందకాలు తవ్వి వాటిల్లో మొసళ్లను మోహరించాలని ఆయన ప్రతిపాదించారు.

దక్షిణ ఇజ్రాయెల్‌లోని 'కెట్జియోట్' జైలు చుట్టూ ఈ మొసళ్లను మోహరించాలని భావిస్తున్నట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. 2023 అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడి తర్వాత పట్టుబడిన అనేక మంది హమాస్ ఉగ్రవాదులను ప్రస్తుతం ఈ జైల్లోనే బంధించారు.

## కీవ్‌పై విరుచుకుపడ్డ రష్యా



ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై బాలిస్టిక్ క్షిపణులతో రష్యా భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో ఒకరు మరణించగా, 14 మంది గాయపడినట్టు అధికారులు తెలిపారు. శనివార రాత్రి పలు చోట్ల దాడులు జరిగాయి. పూర్తి స్థాయి యుద్ధం మొదలైనప్పటి నుంచి కీవ్‌పై జరిగిన అత్యంత భారీ బాలిస్టిక్ దాడుల్లో ఇది ఒకటని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లోదిమిర్ జెలెన్‌స్కీ చెప్పారు. ఉక్రెయిన్ సైన్యం తెలిపిన వివరాల ప్రకారం, రష్యా ప్రయోగించిన 41 క్షిపణుల్లో 18 క్షిపణులను ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయి. మరో 108 డ్రోన్లను కూడా అడ్డుకున్నాయి. అటు ఉక్రెయిన్ కూడా రష్యాలోని లక్ష్యాలపై దాడులు కొనసాగిస్తోంది. తాజా దాడుల్లో ఇస్కాండర్, హైపర్ సోనిక్ జిర్కాన్ క్షిపణులతో పాటు 125 డ్రోన్లను కూడా రష్యా వినియోగించిందని ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. ఆదివారం కీవ్ మేయర్ విటాలీ క్లిచ్కో మాట్లాడుతూ.. ఈ దాడుల్లో నివాస భవనాలు, ఇతర భవనాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఒక సూపర్ మార్కెట్, ఒక వసతి గృహం కూడా నష్టం చవిచూశాయని అన్నారు. రెండు గిడ్డంగుల్లో చెలరేగిన మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తెచ్చే పనిలో ఉన్నారు. కాగా గత వారం ఉక్రెయిన్ పై రష్యా సుమారు 1,450 దాడి డ్రోన్లు, 1,640కు పైగా బాంబులు, 99 రకాల క్షిపణులను ప్రయోగించిందని జెలెన్‌స్కీ చెప్పారు. తాజా దాడులకు ముందు, రష్యాలోని అతిపెద్ద ఆన్‌లైన్ రిటైలర్ వైల్డ్‌బెర్రీస్కు చెందిన రెండు గిడ్డంగులను ఉక్రెయిన్ డ్రోన్లతో ధ్వంసం చేసింది. ఈ ఘటనలో 8 మంది మరణించగా, భారీ అగ్నిప్రమాదాలు సంభవించాయి. ఇటీవలి కాలంలో రష్యా కీలక ఇంధన మౌలిక సదుపాయాలపై దీర్ఘ శ్రేణి డ్రోన్ దాడులను ఉక్రెయిన్ మరింత తీవ్రం చేసింది. దీని వల్ల విస్తృత స్థాయిలో ఇంధన కొరత ఏర్పడింది. ఈ నెల ప్రారంభంలో రష్యా చమురు శుద్ధి సామర్థ్యంలో దాదాపు 43% పనిచేయకుండా చేశామని కీవ్ ప్రకటించింది.

## అమెరికాను కమ్ముకున్న కెనడా కార్చిచ్చు పొగ



వాతావరణ మార్పుల వల్ల అమెరికా, కెనడాలలో కార్చిచ్చులు రేగుతూనే ఉన్నాయి. కెనడాలో అదుపులేని అడవి మంటల వల్ల ఆ పొగలు కమ్మేసి అమెరికాలోని పలు రాష్ట్రాల్లో గాలి నాణ్యత క్షీణించింది. ప్రజలు, ముఖ్యంగా గుండె లేదా ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు, వృద్ధులు, పిల్లలు గాలి నాణ్యత మెరుగుపడే వరకు బయటకు వెళ్లరాదని అధికారులు సూచించారు. చాలా రాష్ట్రాల్లో ప్రమాదకర పరిస్థితులు కొనసాగుతాయన్నారు. కార్చిచ్చుల ద్వారా వ్యాపిస్తున్న పొగ, మంటలకు కెనడా అటవీ నిర్వహణ లోపాలే కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. కెనడాపై అదనపు సుంకాలను విధిస్తామని హెచ్చరించారు.

ట్రంప్ వ్యాఖ్యలపై కెనడా ప్రభుత్వం స్పందించింది. ఆంటారియో రాష్ట్ర నేత డగ్ ఫోర్డ్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఫిర్యాదులు చేయడం మాని పొరుగువారికి సహాయం చేయడం మంచిదన్నారు. మనం మన అమెరికన్ స్నేహితుల కోసం గతంలో కచ్చితంగా అదే పని చేశాం' అని ఫోర్డ్ చెప్పారు. కెనడాలోని ఉత్తర అంటారియోలో సుమారు 190 చోట్ల కార్చిచ్చులు, మంటలు వ్యాపించాయి. మంటలు రేగుతున్న ప్రాంతాల నుంచి ప్రజలను ఖాళీ చేయించారు. మరికొన్ని ప్రాంతాల ప్రజలను ఖాళీ చేసే అవకాశం ఉంది.

# ఫిఫా ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్‌కు కాంస్యం

- 6-4తో ఫ్రాన్స్‌పై విజయం
- రెండు గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపె

ఫిఫా ప్రపంచకప్ 2026లో మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్ అభిమానులకు అసలైన ఫుట్‌బాల్ మజాను పంచింది. హోరాహోరీగా సాగిన ఈ హై స్కోరింగ్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 6-4 గోల్స్ తేడాతో ఫ్రాన్స్‌పై ఘన విజయం సాధించి, కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. 1966లో టైటిల్ గెలిచిన తర్వాత ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం.

ఇంగ్లండ్ స్టార్ ఫార్వర్డ్ బుకాయో సాకా అద్భుత హాట్రిక్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ 37వ నిమిషంలో ఆపై తొలి సగం అదనపు సమయంలో గోల్స్ చేసిన సాకా.. 87వ నిమిషంలో లభించిన పెనాల్టీని విజయవంతంగా గోల్‌గా మలిచి తన కెరీర్‌లో రెండో అంతర్జాతీయ హ్యాట్రిక్‌ను నమోదు చేశాడు. డెక్లాన్ రైస్, ఎజ్రి కొన్సా కూడా చెరో గోల్ చేయడంతో తొలి సగభాగం ముగిసేసరికి ఇంగ్లండ్ 4-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది.




రెండో అర్ధ భాగంలో ఫ్రాన్స్ పుంజుకుని ఇంగ్లండ్‌కు గట్టి పోటీ ఇచ్చింది. స్టార్ స్ట్రైకర్ క్లియాన్ ఎంబాపె చెలరేగి రెండు గోల్స్ చేయగా, బ్రాడ్లీ బార్కోలా మరో గోల్ అందించాడు. దీంతో ఇంగ్లాండ్ ఆధిక్యం 4-3కి తగ్గి ఉత్కంఠ రేపింది. అయితే సకా పెనాల్టీ గోల్‌తో ఇంగ్లండ్ మళ్లీ పుంజుకుంది. ఇంజ్యూరీ టైమ్‌లో ఫ్రాన్స్ ఆటగాడు ఉస్మానే డెంబెలే గోల్ చేసినప్పటికీ, చివరి నిమిషంలో ఇంగ్లండ్ స్టార్ జూడ్ బెల్లింగ్‌హామ్ (టోర్నీలో 7వ గోల్) నెట్‌లోకి బంతిని పంపి 6-4తో విజయాన్ని ఖరారు చేశాడు.

ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసిన ఎంబాపె.. వరల్డ్ కప్ చరిత్రలో అత్యధిక గోల్స్ (22) చేసిన ఆటగాడిగా లియోనెల్ మెస్సీ (21) రికార్డును బద్దలు కొట్టాడు. ప్రస్తుత టోర్నీలో 10 గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులోనూ అతడు అగ్రస్థానంలో నిలిచాడు. ఈ ప్రపంచ కప్ లో గోల్డెన్ బూట్ రేసులోనూ ఎంబాపె -ముందున్నాడు. ఎంబాపె 10 గోల్స్ చేయడంతోపాటు 4 అసిస్ట్స్ ఇచ్చాడు. మరోవైపు మెస్సీ 8 గోల్స్ చేసి 4 అసిస్ట్స్ ఇచ్చాడు. 1982లో హంగేరి-ఎల్ సాల్వడార్ (10-1) మ్యాచ్ తర్వాత ప్రపంచకప్‌లో ఇదే అత్యధిక స్కోరింగ్ మ్యాచ్ కావడం విశేషం. అంతేకాకుండా, వరల్డ్ కప్ చరిత్రలోనే ఒక మూడో స్థానపు మ్యాచ్‌లో ఇరు జట్లు కలిసి పది గోల్స్ చేయడం ఇదే తొలిసారి.

# వన్‌డే సిరీస్‌కూడా సమర్పయామి!

- రోహిత్ సెంచరీ వృథా
- చివరి వన్‌డేలో 27 పరుగులతో ఓడిన టీమిండియా
- 2-1తో సిరీస్ ఇంగ్లాండ్ కైవసం



ఇంగ్లాండ్ పర్యటనలలో టీమిండియా ఓటముల పరంపర కొనసాగింది. ఇంతకు ముందే టీ 20 సిరీస్‌ను చేజార్చుకున్న భారత్ ఇప్పుడు వన్‌డే సిరీస్‌నూ ఇంగ్లాండ్‌కు సమర్పించుకుంది. ఆదివారం లార్డ్స్ మైదానంలో జరిగిన సిరీస్ నిర్ణాయక మూడో వన్‌డేలో ఇంగ్లాండ్ 27 పరుగుల తేడాతో భారత్‌పై గెలుపొంది సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. మొదటి వన్‌డేలో భారత్, రెండో వన్‌డేలో ఇంగ్లాండ్ గెలుపొందిన విషయం తెలిసిందే. 388 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో టీమిండియా 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 360 పరుగులు మాత్రమే చేసి పరాజయం పాలయింది. రోహిత్ శర్మ అద్భుత శతకం వృథా అయింది.


388 పరుగుల భారీ లక్ష్య ఛేదనతో టీమిండియాకు శుభారంభమే దక్కింది. ఓపెనర్లు రోహిత్ శర్మ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలివికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. రోహిత్ 138 (110 బంతుల్లో, 17 ఫోర్లు, 5 సిక్సులు), శుభ్‌మన్ 77 (84 బంతుల్లో, 10 ఫోర్లు, 1 సిక్స్), విరాట్ కోహ్లి 74 (60 బంతుల్లో, 4 ఫోర్లు, 3 సిక్సులు) రాణించినా మిగిలిన బాటర్లు విఫలం కావటంతో భారత్ ఓటమి పాలయింది. గిల్‌ను ఆదిల్ రషీద్ ఔట్ చేయగా, పార్ట్‌టైమ్ బౌలర్ జాకబ్ బెతెల్ బౌలింగ్‌లో రోహిత్ బౌల్డ్ అయ్యాడు. ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానంలో వన్‌డేలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా రోహిత్ చరిత్ర సృష్టించాడు.

సామ్ కరన్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఇంగ్లాండ్ జట్టును గెలిపించాడు. భారత్ విజయం దిశగా దూసుకెళుతున్న దశలో ఒకే ఓవర్ (44వ ఓవర్)లో ఇషాన్ కిషన్ 14 (12 బంతులు), శ్రేయస్ అయ్యర్ 0 (3 బంతులు)ను ఔట్ చేసి మ్యాచ్‌ను ఇంగ్లాండ్ వైపు తిప్పాడు. తరువాత జోరు మీదున్న కోహ్లిని, అక్షర్ పటేల్ (2)ను కూడా వెనక్కి పంపించి ఇంగ్లాండ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. కేఎల్ రాహుల్ (12 పరుగులు)ను జోఫ్రా ఆర్చర్ ఔట్ చేశాడు.

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లీష్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 387 పరుగులు చేసింది. వన్డేల్లో భారత్‌పై ఇంగ్లాండ్‌కు ఇదే అత్యధిక స్కోరు. లార్డ్స్ మైదానంలోనూ వన్డేల్లో ఇది అత్యధిక స్కోరు. ఓపెనర్ బెన్ డకెట్ (141; 135 బంతుల్లో 18 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో విరుచుకుపడగా.. మరో ఓపెనర్ జాకబ్ బెతెల్ (91; 93 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్ లు) సెంచరీ మిస్ చేసుకున్నాడు. జో రూట్ (74 నాటౌట్: 48 బంతుల్లో 9 ఫోర్లు) మరోసారి రాణించాడు. చివర్లో జోస్ బట్లర్ (41నాటౌట్, 13 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు) మెరుపులు మెరిపించాడు. హ్యారీ బ్రూక్ 14 పరుగులు చేశాడు. భారత బౌలర్లలో ప్రసిద్ధ కృష్ణ 2, ప్రిన్స్ యాదవ్ ఒక వికెట్ పడగొట్టారు.

డకెట్, బెతెల్ ఓపెనింగ్ జోడీ భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. వికెట్ కోసం భారత బౌలర్లు ప్రయత్నించినా వీరు ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు. 30 ఓవర్ల తర్వాత భారత్ నిరీక్షణకు తెర పడింది. సెంచరీ చేసేలా కనిపించిన బెతెల్‌ను ప్రసిద్ధ కృష్ణ వెనక్కి పంపాడు. డీప్ స్క్వేర్ లెగ్లో ఉన్న రోహిత్‌కు క్యాచ్ ఇచ్చి బెతెల్ వెనుదిరిగాడు. దీంతో 192 పరుగుల తొలి ఇన్నింగ్స్ భాగస్వామ్యానికి తెరపడింది. వన్డేల్లో ఇంగ్లాండ్‌కు ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం. తర్వాత డకెట్, రూట్ 80 బంతుల్లో 101 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ప్రిన్స్ యాదవ్‌కు డకెట్ రిటర్న్ క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఈ ఇన్నింగ్స్‌తో లార్డ్స్ మైదానంలో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన వివ్ రిచర్డ్స్ (138 నాటౌట్) రికార్డును డకెట్ బ్రేక్ చేశాడు. చివర్లో బట్లర్, రూట్ కలిసి 19 బంతుల్లోనే 63 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇంగ్లాండ్ చివరి మూడు ఓవర్లలో ఏకంగా 62 పరుగులు చేసింది.

# సింధు సరికొత్త చరిత్ర



## జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ కైవసం

భారత బ్యాడ్మింటన్ స్టార్, తెలుగు తేజం, పీవీ సింధు సరికొత్త చరిత్ర సృష్టించింది. జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో సింధు అద్భుత ప్రదర్శనతో మెరిసింది. అంతేకాక తన కెరీర్‌లో మొట్టమొదటి సూపర్ 750 టైటిల్‌ను కైవసం చేసుకుంది పీవీ సింధు. టోక్యో వేదికగా ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో 21-17, 21-17తో వరుస గేమ్స్ తేడాతో జపాన్ ప్లేయర్ అకానె యమగూచిని సింధు చిత్తు చేసింది. దీంతో జపాన్ ఓపెన్ టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా సింధు రికార్డులకెక్కింది.

2024లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్ గెలిచిన తర్వాత సింధుకు ఇదే తొలి టైటిల్. అంతేకాకుండా, 2019లో ప్రపంచ ఛాంపియన్‌షిప్ స్వర్ణం గెలిచిన తర్వాత సింధు సాధించిన అతిపెద్ద విజయం ఇదే కావడం విశేషం. జపాన్ ఓపెన్ ఫైనల్‌కు చేరడం యమగూచికి ఇది ఆరోసారి. గత నాలుగేళ్లుగా ఆమెపై పూర్తిస్థాయిలో ఆడిన ఏ మ్యాచ్‌లోనూ సింధు విజయం సాధించలేకపోయింది. ఈ ఏడాది మలేషియా ఓపెన్‌లో వీరిద్దరూ తలపడినప్పటికీ.. తొలి గేమ్ తర్వాత యమగూచి గాయం కారణంగా వైదొలిగింది. ఫైనల్ మ్యాచ్‌లో ప్రారంభం నుంచే సింధు పూర్తి దూకుడును ప్రదర్శించింది. అద్భుతమైన నెట్ గేమ్, పక్కా ప్రణాళికతో కోర్టుపై పూర్తి నియంత్రణ సాధించింది. యమగూచికి పుంజుకునే అవకాశం ఇవ్వకుండా బంతిని నెట్‌కు దగ్గరగా ఉంచుతూ, క్రాస్-కోర్ట్, బాడీ స్మాష్‌లతో విరుచుకుపడింది. క్రమశిక్షణ, నిగ్రహంతో కూడిన ఆట తీరుతో ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చరిత్రాత్మక విజయంతో సింధు తన ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకుంది.

## సడలని ఆత్మ విశ్వాసం..
## అదే గెలుపు మంత్రం




జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా నిలిచిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు తన గెలుపుపై స్పందిస్తూ భావోద్వేగానికి గురయింది. ఈ టైటిల్ అందుకున్న తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించిన సింధు.. మాట్లాడుతూ కష్టకాలంలో కూడా తనపై నమ్మకం కోల్పోలేదని.. అదే తన విజయానికి కారణమైందని వెల్లడించింది. వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఇదే జోరును కొనసాగించి రికార్డు స్థాయిలో ఆరో పతకాన్ని సాధించడమే తన లక్ష్యమని స్పష్టం చేసింది. కాగా ఫైనల్ పోరులో జపాన్‌కు చెందిన స్టార్ ప్లేయర్ యమగూచిపై 21-17, 21-17 వరుస సెట్లలో సింధు గెలుపొందిన సంగతి తెలిసిందే.

'ఈ గెలుపు నాకు ఎంతో ప్రత్యేకం. చాలా కాలంగా దీని కోసమే కష్టపడుతున్నాను. గెలిచిన వెంటనే నా కళ్లలో ఆనందభాష్పాలు వచ్చాయి. గత 19 నెలలుగా టైటిల్ కోసం ఎదురుచూస్తున్నాను. చాలా మంది 'ఇక సింధు పని అయిపోయిందా?' అని ప్రశ్నించినా.. నేను మాత్రం నా మీద నమ్మకం కోల్పోలేదు. నేను చేయగలనని ఎప్పుడూ విశ్వసించాను. ఆ నమ్మకమే నన్ను గెలిపించింది. ఈ ప్రయాణంలో నాకు తోడున్న నా కోచ్‌లకు, నా వెన్నంటే ఉన్న తల్లిదండ్రులు, నా భర్త, అత్తమామలకు కృతజ్ఞతలు ' అని సింధు వెల్లడించింది. 2024 డిసెంబర్‌లో సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ టైటిల్ గెలిచిన తర్వాత సింధుకు ఇదే తొలి మేజర్ టైటిల్ కావటం విశేషం. అలాగే 2019 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన తర్వాత ఆమె ఖాతాలో చేరిన అత్యంత ప్రతిష్ఠాత్మక గెలుపు కూడా ఇదే.

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌పై గురి

ఆగస్టు 17 నుంచి 23 వరకు భారత్ వేదికగా జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు ముందు ఈ విజయం తనలో అపార ఆత్మవిశ్వాసాన్ని నింపిందని సింధు తెలిపింది. ఇప్పటికే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఐదు పతకాలు గెలిచిన ఆమె.. మరో పతకం సాధిస్తే మహిళల సింగిల్స్‌లో ఆరు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు గెలిచిన తొలి ప్లేయర్‌గా చరిత్ర సృష్టించనుంది. 'ఇప్పుడున్న ఆటతీరు, ప్రశాంతత, ఆత్మవిశ్వాసాన్ని అలాగే కొనసాగించాలి. ఈ విజయానికి ఇదే సరైన సమయం. ఇదే జోరును ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లోనూ కొనసాగించాలనుకుంటున్నాను. ఎలాంటి పరిస్థితి ఎదురైనా ప్రశాంతంగా ఉండటం చాలా ముఖ్యం. అటాకింగ్ గేమ్ నా బలం. ఇప్పుడు కోర్టులో స్వేచ్ఛగా కదులుతూ దూకుడుగా ఆడగలుగుతున్నాను. అనవసర తప్పిదాలను తగ్గించగలిగితే మ్యాచ్‌పై పూర్తి నియంత్రణ సాధించవచ్చు. అదే ఈ టోర్నీలో నాకు కలిసొచ్చింది' అని సింధు వివరించింది.

చైతన్య రథం
సినిమా
సోమవారం 20 జూలై 2026 X

# ఇంత ఇష్టమా..అంటున్న 'కామ్రేడ్ కల్యాణ్'

శ్రీవిష్ణు, మలయాళ బ్యూటీ మహిమ నంబియార్ జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'కామ్రేడ్ కల్యాణ్'. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్పీ బ్యానర్‌పై వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఒరియా పిల్లా మంచి ఆదరణ దక్కించుకున్నాయి,

ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి.. ఇంత ఇష్టమా .. అంటూ సాగే ప్రేమ పాటను మేకర్స్ విడుదల చేశారు. విజయ్ బుల్గానిన్ సంగీతం అందించిన ఈ పాటను రామ్ మిర్యాల, లిప్సిక ఆలపించారు. భాస్కరభట్ల సాహిత్యం అందించారు. ఈ పాట విడుదల అయిన కొద్ది సమయంలోనే యూ ట్యూబ్‌లో ట్రెండింగ్‌లోకి వచ్చేసింది.




## 'పొలిమేర 3'లో యాక్షన్ కింగ్ అర్జున్



కమెడియన్ పాత్రలతో మెప్పించిన సత్యం రాజేష్‌ను హీరోగా నిలబెట్టిన సినిమా 'మా ఊరి పొలిమేర' అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా నేరుగా ఓటీటీలో రిలీజై అనూహ్య స్పందన తెచ్చుకుంది. ఈ సంచలన విజయంతో మేకర్స్ కొంచెం ఎక్కువ బడ్జెట్ పెట్టి థియేటర్లలో విడుదల చేసిన 'పొలిమేర-2' సైతం భారీ లాభాలను తెచ్చిపెట్టింది. ఓటీటీలో చిన్నగా మొదలైన ఈ మిస్టరీ థ్రిల్లర్ ఫ్రాంఛైజీ ఇప్పుడు మూడో భాగంతో అంతకుమించిన పెద్ద రేంజిలో రావడానికి రంగం సిద్ధమవుతోంది. ఈ క్రేజీ పొలిమేర-3 చిత్రానికి ఇప్పుడు ఒక స్పెషల్ అట్రాక్షన్ తోడైంది. సీనియర్ నటుడు, యాక్షన్ సినిమాలకు పెట్టింది పేరైన యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా ఈ సినిమాలో ఒక కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన బ్లాస్ట్ సినిమాతో సూపర్ హిట్ కొట్టిన అర్జున్‌ను ఈ ప్రాజెక్ట్ లోకి తీసుకు రావడం ద్వారా సినిమా హైప్ ఒక్కసారిగా పెరిగిపోయింది.

సత్యం రాజేష్ ఎప్పట్లాగే లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. పొలిమేర-2 చివర్లో పార్ట్-3కి ఇచ్చిన లీడ్ చూస్తే ఈ సినిమా మరింత భారీగా, ఊహించని ట్విస్టులతో ఉండబోతోందని స్పష్టమవుతోంది. అర్జున్ సర్జా లాంటి పవర్‌ఫుల్ నటుడు తోడవడంతో ఈ క్షుద్రపూజలు, చేతబడి నేపథ్యం ఉన్న మిస్టరీ థ్రిల్లర్ ఏ రేంజ్ లో ఉండబోతోందో అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## 'మందాడి' డిస్ట్రిబ్యూషన్ హక్కులు 'మైత్రి'కి

*సుహాస్, సూరి ముఖ్య పాత్రల్లో నటిస్తున్న తాజా రా అండ్ రస్టిక్ చిత్రం 'మందాడి'. ఈ చిత్రాన్ని ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్మెంట్ బ్యానర్ మీద మతిమారన్ పుగళేంది తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటి వరకు ఈ మూవీ నుంచి వచ్చిన కంటెంట్ అందరినీ మెప్పించింది. సుహాస్, సూరి పాత్రలు, ఆ కారెక్టర్స్ మేకోవర్ అదిరిపోయింది. ఇక ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టీం నమ్మకంగా చెబుతోంది. 'మందాడి' సినిమాను సెప్టెంబర్ 10న విడుదల చేయబోతోన్న సంగతి తెలిసిందే. తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో సినిమా విడుదల కానుంది. ఇక ఈ సినిమాని తెలుగులో మైత్రి మూవీస్ రిలీజ్ చేయబోతోంది. ఏపీ, తెలంగాణలో ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్పి భారీ ఎత్తున విడుదల చేయనుంది.*

*ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించారు. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్, తదితరులు ఇతర కీలక పాత్రలను పోషించారు. ఈ సినిమాకి సంగీతాన్ని జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు.*

## సల్మాన్ లుక్‌పై ఫ్యాన్స్ ఆందోళన



బాలీవుడ్ స్టార్ హీరో, కండల వీరుడు సల్మాన్ ఖాన్ తాజా లుక్‌కి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన అభిమానులు, నెటిజన్లు ఆయన ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ముంబైలో ఓ ఐటీ సర్వర్ రూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సల్మాన్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఈవెంట్‌కు సంబంధించిన వీడియోలే ప్రస్తుతం నెట్టింట్లో హల్చల్ చేస్తున్నాయి. ఈ వీడియోలో సల్మాన్ ఖాన్ మునుపటి కంటే చాలా బరువు తగ్గి, కాస్త సన్నగా కనిపించారు. ఆయన కళ్లలో తీవ్రమైన అలసట కనిపించడం, ముఖంలో మెరుపు తగ్గడం, నడిచేటప్పుడు కూడా కాస్త నీరసంగా ఉండటంతో నెటిజన్లు షాక్‌కు గురయ్యారు. 'కండల వీరుడు ఇలా అయిపోయాడేంటి?', 'ఆయనకు ఏమైనా అనారోగ్య సమస్య ఉందా?' అంటూ సోషల్ మీడియా వేదికగా ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మాత్రం సినిమా కొత్త సినిమా కోసం ఇలా మేకోవర్ అయ్యాడేమో అని కామెంట్స్ పెడుతున్నారు. ప్రస్తుతం సల్మాన్.. మాతృభూమి, కిక్ 2 సినిమాతో బిజీగా ఉన్నాడు.

## ధ్రువ్ విక్రమ్, అనుపమ బ్రేకప్?

కోలీవుడ్ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్, మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ లవ్ ట్రాక్ ముగిసినట్లుగా కనిపిస్తోంది. గత కొంతకాలంగా వీరిద్దరి రిలేషన్‌షిప్‌పై రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెల్సిందే, వీరిద్దరూ ముద్దు పెట్టుకుంటున్న ఫోటో సోషల్ మీడియాని వైరల్‌గా మారింది. గతేడాది బైసన్ సినిమాలో ఈ జంట కలిసి నటించారు. దీంతో వీరిద్దరూ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కుతారనుకున్నారు. కానీ, ఈలోపే ఈ బంధం ముగిసింది అంటూ అనుపమ ఇన్‌డైరెక్ట్ గా బ్రేకప్ ని తేల్చేసింది. తాజాగా అనుపమ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పెట్టిన ఒక సుదీర్ఘమైన పోస్ట్ ఈ బ్రేకప్ వార్తలను దాదాపు ఖరారు చేసింది. 'చివరికి నా ప్రశాంతతను వెతుక్కోవడానికి కొన్ని డెడ్ ఎండ్స్ వదిలేయాల్సి వచ్చింది' అంటూ ఆమె షేర్ చేసిన పదాలు ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. 'కొన్నిసార్లు, చివరికి మన మనశ్శాంతిని మనం కనుగొనేందుకు ముగిసిపోయిన బంధాలను వదిలేయాల్సి వస్తుంది. ఈ రోజు, ఆ ప్రశాంతత నన్ను వరించింది. ఈ రోజు నా జీవితాన్ని నేనే ఎంచుకుంటున్నాను. ఇకపై ఎవరి అనుమతులూ అవసరం లేదు. ఎలాంటి భయాలూ లేవు. నా దారిలో నేను మళ్లీ ప్రయాణిస్తూ, నన్ను నేను కనుగొంటూ.. నాదన్న సంగతే దాదాపు మర్చిపోయిన నా జీవితంతో నేను మళ్లీ ప్రేమలో పడుతున్నాను. నన్ను మళ్లీ నా వైపునకే నడిపించినందుకు ఆ విశ్వానికి నా ధన్యవాదాలు. ఇకపై అంతా నయం కావాలి. స్వేచ్ఛ వికసించాలి. నన్ను నేను ఎంచుకోవాలి. చివరికి.. పూర్తిగా ఎలాంటి మొహమాటం లేకుండా నా స్వంతమైన నా జీవితానికి స్వాగతం.. అంటూ రాసుకొచ్చింది. ఈ సుదీర్ఘ



పోస్ట్‌లో అనుపమ తన అంతర్గత ఆవేదనను చాలా ఎమోషనల్‌గా వ్యక్తపరిచింది. ఎక్కడా ధ్రువ్ పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ.. తనను ఇంతకాలం ఎవరో కంట్రోల్ చేశారనే అర్థం వచ్చేలా ఆమె పెట్టిన పోస్ట్ ఇప్పుడు కోలీవుడ్, టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అంతేకాకుండా ఇన్‌స్టాగ్రామ్‌లో ధ్రువ్ ని అనుపమ అన్ ఫాలో చేయడంతో ఈ బ్రేకప్ నిజమేనని నెటిజన్స్ చెప్పుకొస్తున్నారు.

# 'రామాయణ'..ప్రథమ్ సంకల్ప్!

**- ట్రైలర్ ప్రత్యేక ప్రదర్శన**

భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. విడుదలకు ముందే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. నితీశ్ తివారీ దర్శకత్వంలో.. రాముడిగా బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' దీపావళి సందర్భంగా ఈ ఏడాది నవంబరులో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 24న ట్రైలర్ విడుదల చేయనున్నారు. దీనిలో భాగంగా ఢిల్లీలో ప్రథమ్ సంకల్ప్ పేరుతో వేడుకను నిర్వహించి.. ట్రైలర్‌ని ప్రత్యేకంగా ప్రదర్శించారు.

ఈ సందర్భంగా రణ్‌బీర్ కపూర్ మాట్లాడుతూ.. నేను చిన్నప్పటి నుంచి శ్రీరాముడి కథలు వింటూ పెరిగా. శ్రీరాముడిని ఎప్పుడూ నా మనసులో ఉంచుకుని జీవించాను. అలాంటి శ్రీరాములవారి పాత్రను పోషించే అవకాశం రావడం నా అదృష్టం.. రామానంద్ సాగర్ 'రామాయణం'లో శ్రీరాముడి పాత్రను అరుణ్ గోవిల్ పోషించారు. ఎంతో మంది ప్రేక్షకులకు ఆయన ఈ పాత్రతో ఆదర్శంగా నిలిచారన్నారు.

రావణ పాత్ర పోషిస్తున్న పాన్ ఇండియా రాకింగ్ స్టార్ యశ్ మాట్లాడుతూ "మన శ్రీరాముడి కథని.. గ్లోబల్ వేదికపై నిలబెట్టాలి.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో చేసిన చిత్రమే 'రామాయణ" అన్నారు. యశ్ ఇందులో రావణుడి పాత్రను పోషిస్తూనే.. నమిత్ మల్హోత్రాతో కలిసి తన మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ ద్వారా సహ నిర్మాతగా వ్యవహరించారు. ఇది కేవలం సినిమా కాదు. భారతదేశం కల. ఆ కలని నిజం చేయడం కోసం



మేమంతా కలిశామన్నారు

దర్శకుడు నితేశ్ తివారీ మాట్లాడుతూ రామాయణం గొప్పతనం పరిమాణంలో కాదు.. విలువల్లో ఉంది. ఒక దర్శకుడిగా ఈ కథని సంపూర్ణ నిజాయితీ, ప్రామాణికత, అత్యంత గౌరవంతో తెరపై ఆవిష్కరించడమే నా బాధ్యత. అందరం ఒకే ఆలోచనతో పనిచేశాం. ప్రేక్షకులు ఈ సినిమాతో రామాయణంలోని భావోద్వేగం, మానవత్వాన్ని గ్రహిస్తారని భావిస్తున్నానిని  ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇలాంటి గొప్ప పాత్రలు పోషించడం పెద్ద సవాల్ అని సాయిపల్లవి అభిప్రాయడ్డారు. ఈ సినిమాలోని పాత్రలు భవిష్యత్తు తరాలకు పురాణ పాత్రలుగా గుర్తుండిపోతాయి. అలాంటి అద్భుతమైన అవకాశాన్ని నాకు ఇచ్చిన దర్శకుడు, నిర్మాతలకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఇలాంటి గొప్ప పాత్రలను పోషించడం ప్రతి నటీనటుడికి ఒక పెద్ద సవాల్. సీతమ్మ పాత్రను పోషించడం నా అదృష్టం. ఆ పాత్రకు పూర్తిగా న్యాయం చేయాలని ప్రయత్నించా. ఈ క్రమంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నా. నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే అనుభవంగా ఈ ప్రయాణం నిలిచిపోతుందని పేర్కొన్నారు.

ఈ వేడుకకు సన్నీ డియోల్ హాజరుకావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందిన హనుమంతుడు పాత్రలో ఆయన నటిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా, జూలై 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న అధికారిక ట్రైలర్‌ను ఎంపిక చేసిన అతిథులకు ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ ప్రయాణం న్యూఢిల్లీకే పరిమితం కాలేదు. 'రామాయణ స్కూల్స్ ప్రోగ్రామ్' ద్వారా దేశవ్యాప్తంగా 500కు పైగా పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులు రామాయణం బోధించే శాశ్వత విలువలను క్రియేటివ్ ప్రోగ్రామ్స్ ద్వారా తెలుసుకునే అవకాశం పొందారు. అందులో విజేతలుగా నిలిచిన కొందరు చిన్నారులను ఈ 'ప్రథమ్ సంకల్ప్' కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించారు. అలాగే దేశంలోని 20 నగరాల్లోని వందలాది మంది చిన్నారులు, కంటెంట్ క్రియేటర్లు, అభిమానులను ప్రత్యేకంగా ఆహ్వానించి.. ప్రపంచవ్యాప్త విడుదలకు ముందే ట్రైలర్‌ను ప్రత్యేకంగా వీక్షించే అవకాశాన్ని కల్పించారు.

ఈ వేడుకలో భారతీయ సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఒకే వేదికపై సందడి చేశారు. రామానంద్ సాగర్ 'రామాయణం'లో శ్రీరాముడి పాత్రతో కోట్లాది మంది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన అరుణ్ గోవిల్, ఈ చిత్రంలో దశరథ మహారాజు పాత్రలో కనిపించనున్నారు. అలాగే  కైకేయి పాత్రలో శోభన, విశ్వామిత్ర మహర్షిగా అజింక్య దేవ్,  ఇంద్రుడిగా కునాల్ కపూర్, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్, లక్ష్మణుడిగా రవీ దూబే నటిస్తున్నారు. భారతీయ సినీ పరిశ్రమలోని అత్యుత్తమ ప్రతిభను, ప్రపంచ ప్రఖ్యాత దర్శకులు, సాంకేతిక నిపుణులు, కళాకారులతో కలిపి ఒకే వేదికపైకి తీసుకురావాలన్న నిర్మాత నమిత్ మల్హోత్రా సంకల్పానికి ఈ కార్యక్రమం ప్రతీకగా నిలిచింది.